# పుల్లయ్య్య

# గుప్తనిధి

రచన: సి. రఘోత్తమ రావు

An Avakaaya.com Presentation

# పుల్లయ్య గుప్తనిధి

రచన: సి. రఘోత్తమ రావు

An Avakaaya.com Presentation

## గుప్తనిధికి తాళముందండి! చెవి కావాలి!

*"పుల్లయ్య కళ్ళు మూసుకొన్నాడు. చాలా వెలుతురుగా ఉంది.*

*కళ్ళు మూసినా, తెరిచినా వెలుతురుగా ఉండడమే గుప్తనిధి."*

పుల్లయ్య పేరు తర్వాత "గుప్తనిధి"ని తగిలించి తన కథలో ఏదో వెతుక్కోమని రఘోత్తమ రావు చేసిన ప్రయోగం మాత్రం నా వరకూ ఫలించింది. ఎందుకంటే పుల్లయ్య లోని కోపం, ఆదుర్దా, తనపట్ల తనకు కలిగే ఈసడింపూ, చిన్న చిన్న విషయాలపై పెద్ద పెద్ద పట్టింపులకు పోవడం వంటివన్నీ నాబోటి వాళ్లకు సహజాలే. ఈ సహజమైన విషయాల్లో అసహజమైన విషయాల వెతుకులాటే గుప్తనిధి కోసం చేసే శోధన.

*****

ఒక్కటి మాత్రం నిజం - ఈ మధ్య వచ్చిన కథలలో *పుల్లయ్య గుప్తనిధి* ఒక విచిత్రమైన శైలిలో చెప్పిన కథ. ఈ రచయితే వ్రాసిన వైకుంఠపాళీలోలా ఈ కథలో ఎక్కడా ఎటువంటి తత్వావిష్కరణా జరుగలేదు. ఒకానొక కథ ఇలా, ఇలా జరిగింది అని మాత్రం చెప్పడం కనబడుతుంది.

కానీ కథ లోని పుల్లయ్య-సన్యాసి పాత్రలు, వీరిరువురి పూర్వాపరాలు అంతర్లీనంగా కొన్ని విషయాలను చెప్పక చెబుతాయి. ఉదా: బుర్ర బుసకొట్టడం, ఒక్కోసారి బుర్ర తన అస్తిత్వాన్ని కోల్పోవడం, కోపానికి కారణాలు, పర్యవసానాలూ వగైరా వగైరా.

*****

*"పుల్లయ్య అడుగులు చకచకా పడసాగాయి. వాడి కాళ్ళ కింద గడ్డి పరకలు నలిగిపోతున్నాయి. వాటి అంచులకి విరిసిన చిట్టి చిట్టి పూలు చిట్లిపోతున్నాయి. ఆ పూలలోని తేనెను తాగడానికి వచ్చిన చిన్నారి పురుగుల్లో అదృష్టమున్నవి ఎగిరి బ్రతికిపోయాయి, లేనివి నలిగి చచ్చిపోయాయి."*

ఈ దృశ్యాన్ని చదివితే మన దైనందిన జీవితంలోని ఒక్క కోపపూరితమైన ప్ర"వర్తన" ఎన్ని ప్రమాదాలను, విధ్వంసాలను చేస్తూ సాగుతుందోనని చెప్పడానికి వాడుకొన్న ఒక ప్రతీకలాగా అనిపిస్తుంది.

*****

ఈ కథలో కంటికి కనబడేవి రెండు పాత్రలు – ఒకటి ఫుల్లయ్య, రెండవది సన్యాసి. అలానే కంటికి కనబడకుండా కేవలం వినబడే మూడో పాత్ర ఫుల్లయ్య 'బుర్ర.' సదరు బుర్ర మనల్ని రెచ్చగొడితే వచ్చే నష్టం ఫుల్లయ్య కథ ద్వారా అవగతం చేసుకోవచ్చు. చదువుతున్నంతసేపూ నా పాఠక బుర్ర కూడా ఫుల్లయ్య బుర్రతో సమానంగా పనిచేయడం, బుస్సుమనడం ఒక చక్కని అనుభూతి.

*****

*"భయం తనలో తారతమ్యం లేకుండా చూసుకొంటూనే భయస్థుల తారతమ్యాల్ని బాగా తెలుసుకొని మరీ భయపెడ్తుంది. అందుకే భయం చాలా గొప్పది."*

నిజమే సుమా!

*****

కొండ ఎక్కడం, ఎక్కుతూ జారిపడడం, గాయమవడం, సన్యాసిని కలవడం, సన్యాసి గుడిసెలో బంగారం, పేరు కథ, సన్యాసి కథ, ఫుల్లయ్య గాయం మానడం, వాడి మనసు మారడం - ఇవన్నీ కథలో వచ్చే ఘట్టాలు మాత్రమే కావు. వీటి వెనుక ఉన్న తత్త్వ విషయాల్ని పాఠకులే వెదికి పట్టుకోవాలి. అందుకే “తాళము ఉన్నది. చెవి కావలెను” అని మొదట్లోనే చెప్పేసాను.

*****

ఇంకో విచిత్రమైన విషయమేమిటంటే ఈ కథాగమనంలో నేను ఆ రెండు పాత్రలపైనే దృష్టిపెట్టాను కానీ కథ యొక్క దేశ కాలాలపై అంతగా మనసు పెట్టలేదు. కాలాతీతంగా పరిచయం కాబడే ఫుల్లయ్య, సన్యాసి పాత్రలు మానవ చరిత్ర మొదటి నుండి నేటి వరకూ ఉండేవని కాబోలు రచయిత ఉద్దేశం.

కేవలం ఒక్క చోట మాత్రం బహుశా సన్యాసి కథలో అనుకొంటాను కథాకాలం గురించి రచయిత అంటీముట్టనట్టుగా చెప్పడం జరిగింది. అదొక్కటీ వదిలేస్తే ఈ కథ ఏకాలంలో జరిగిందన్న విషయం వైపుకు నా మనసు పోలేదు.

*****

*"గొప్పదనం పేరులో ఉండదు. ఆ గొప్పదనం మనిషిలో ఉండాలి."*

మొత్తం మీద పాఠకుడి కి పెర్రి ఫుల్లయ్య ఎవరో ఆసాంతం చదివాకా తెలిసిపోవడం ఈ కథ లోని గొప్పదనం.

చదవండి, మీ గుప్తనిధిని మీరే వెతుక్కోండి!

నమస్తే

**ఐ.వి.ఎస్.ఎస్. రాజు**

# కోపం చెట్టు



పుల్లయ్య కొమ్మెక్కి కూర్చున్నాడు.

వాడితో బాటూ వాడి 'బుర్ర' కూడా ఉంది. అదెప్పుడూ వాడితోనే, వాడిలోనే ఉంటూంటుంది.

దూరంగా ఆవులు మేస్తున్నాయి. మధ్యమధ్య అరుస్తున్నాయి. మళ్ళీ మేస్తున్నాయి. లేగదూడలు కొత్తగా కనబడుతున్న ప్రపంచాన్ని చూస్తూ గెంతులేస్తున్నాయి.

రెండు కుక్కలు సరిహద్దుల కోసం కొట్లాడుకొంటున్నాయి. కొన్ని కోతులు బిరబిరా బయలును దాటి తోపు కేసి పరుగెడుతున్నాయి.

పుల్లయ్య చూపులు మాత్రం ఎదురుగా, దూరంలో నిలబడివున్న కొండల కేసి చూస్తున్నాయి. వాడి కంటికి, కొండలకీ మధ్య గీత గీస్తున్నట్టుగా మేఘాలు సాగుతున్నాయి.

అతని చూపుల్ని మరల్చడానికేమో అన్నట్టు నాలుగు కొంగలు ఇటునుండి అటుకు ఎగిరితే, ఒంటరి కాకి ఒకటి అరుస్తూ గద్దలా రెక్కల్ని నిలిపి గిరికీలు కొట్టడానికి ప్రయత్నిస్తోంది.

చుట్టూ వున్న వాతావరణం చల్లగా ఉంది. వెల్ల వేసినట్లుగా సూర్యుడి బంగారు వెలుగులో చుట్టు పట్టులన్నీ మెరిసిపోతున్నాయి.

ఏవ్వరి కోసమని ఈ ప్రకృతి ఇన్ని వగలుపోతుందో!

పుల్లయ్య కదల్లేదు.

వాడంతే!

కదలడు – వదలడు.

పుల్లయ్యకు కోపమొస్తే అలా కొమ్మెక్కి కొండలకేసి చూస్తూ ఉండిపోతాడు. ఇప్పుడు కూడా వాడికి కోపమొచ్చింది. కనుకనే కొమ్మెక్కేసాడు.

పుల్లయ్య కోపానికి సవాలక్ష కారణాలు ఉండవు. ఎప్పుడూ వచ్చే ఆ కోపానికి ఎప్పుడూ ఒకే కారణం. "పుల్లయ్య' అనే మూడక్షరాలు.

- - - -

"నాన్నా! నువ్వు ఈ పేరెందుకు పెట్టావ్?"

"అది మీ ముత్తాత పేర్రా! ఆయన మనూర్లో, మన జాతిలో చానా గొప్పోడు."

"నాకీ పేరొద్దు! నాకు కొండయ్య అనే పేరు కావాలి."

"ఒకసారి నామకరణం చేసినాక మళ్ళీ మార్చుకోకూడదురా. ఆచారం ఒప్పుకోదు."

"ఆచారమా? ఇదెవరు! నీ ముత్తాతా?"

"హాహాహా...వెర్రినాగన్నా! ఆచారం అంటే నా ముత్తాత కన్నా వెనకాతలిది. ఈ ప్రపంచకంలోని అందరి కన్నా పాతది. అది చెప్పినట్లే మనం నడుచుకోవాల." అన్నాడు శరభయ్య.

ఈ మాటకు లోపలినుండి 'బుస్'మన్నది పుల్లయ్య బుర్ర.

"నువ్వు నడుచుకో. నాకు మాత్రం కొండయ్య అనే పేరే కావాలి."

శరభయ్యకు తన కొడుకు చేసే మారాము అన్నా, వాగ్యుద్ధమన్నా ఎంతో ఇష్టం. వాడెంత వితండవాదం చేసినా వింటాడు. అందుకని తమాయించుకొని – "ఇప్పుడేమైందిరా?" అన్నాడు.

"నన్నెప్పుడైనా నువ్వు సరిగ్గా చూసావా?"

"ఓరినీ! నువ్వు పుట్టినప్పట్నుంచీ చూస్తూనేవున్నాగదా?"

"మరి నీ కంటికి నేనెట్లా కనబడ్తున్నా?"

"నీకేంరా! మారాజులాగున్నావు. నా దిష్టే తగిలేను."

“ఇదిగో నాన్నా! ఇలా అబద్ధాలు చెప్పడానికి ఆచారం ఒప్పుకొంటుందా? చూడు…ఎలా సన్నగా, పీలగా, బక్కగా, కర్రపేడులాగున్నానో. ఎందుకంటావ్? ఫుల్లయ్య అని పేరు వల్లేగదా.”

“అని ఎవర్రా చెప్పారు?”

“నా బుర్ర చెప్పిం”దని అంటే నాన్న ఏమంటాడోనని “ఒకరు చెప్పేదేంది! నాకే తెలుసు. అందుకే నాకా పేరు వద్దు. ఇప్పుడే మార్చేసుకొంటా. ఇప్పట్నుంచి నేను ఫుల్లయ్యని కాను కొండయ్యని.”

ఎంతో ఇష్టపడి తన తాత పేరును కొడుక్కి పెట్టుకున్నాడు. ఆయన కాలంలో ఆ ఊర్లో ఆయనే చానా గొప్పోడు. అంతటి వాడి పేరును వీడిలా కొట్టిపారేస్తుంటే అంతవరకూ ఉండిన ముద్దు ముచ్చటా తొలిగిపోయింది.

“నోరు ముయ్యరా! వెధవ నోది నువ్వూనూ. నీ పేరు మార్చడానికి కుదర్దు. మా తాత పేరే ఉండాల. ఫో…పోయి తోటలో బెండకాయలు కోసుకురా. సంతకు తీసుకెళ్ళాల.” అని హుంకరించాడు శరభయ్య.

ఫుల్లయ్య ఎదిరించినట్టుగా కదలకుండా నిలబడ్డాడు.

భుజం మీది తుండును తీసి గట్టిగా విదిలించాడు శరభయ్య.

ధభీమని నులక మంచం మీదకు కావాలనే పడిపోయాడు ఫుల్లయ్య.

“ఏందిరా నీ యవ్వారం?” అని విసుగ్గా అరిచాడు శరభయ్య.

“చూసినావా? నీ తుండుగుడ్డ గాలికే పడిపోయాను.” అన్నాడు ఫుల్లయ్య వెక్కిరింపుగా.

అంత కోపంలోనూ పకపకా నవ్వాడు శరభయ్య. వెనకటి ప్రేమ, ప్రీతి మళ్ళీ వచ్చి కూర్చున్నాయి. కొడుకు గుండుమీద ప్రేమగా మొట్టి – “పోరా…వెర్రోడా. బెండకాయలు తీసుకురా ఫో” అని అన్నాడు.

అంతే ఫుల్లయ్యకు మళ్ళీ కోపమొచ్చేసింది.

వాడి కోపానికి మసాలా కూరుస్తున్నట్టుగా లోపల్నుండి ’బుస్’మని బుసగొట్టింది వాడి బుర్ర.

అదెప్పుడూ అంతే! ఫుల్లయ్యకి కోపమొచ్చినప్పుడల్లా బుసకొట్టి రెచ్చగొడ్తుంది. ఏవేవో నూరిపోస్తుంది.

ఇప్పుడు కూడా “రేయ్! నాన్న మాట వినకురా! నువ్వు కుర్రోడివని ఆయన అట్లా తీసిపారేస్తున్నాడు. నీకు తెలీకుండా పేరు పెట్టేసాడు. ఇప్పుడు నువ్వడిగినా పేరు మార్చనంటున్నాడు. ఏమిటిదంతా? తలబిరుసు కాదా? నీ మీద, నీ పేరు మీద వీళ్ళదేంట్రా పెత్తనం? ఆయ్...”

ఆ లోపలి తోపుడుకు గట్టిగా ఊపిరి తీసి వదిలాడు పుల్లయ్య.

“ఏంట్రోయ్! బుసకొడ్తున్నావ్? వెధవా...పో...తోటకుపోయి బెండకాయలు కోసుకురా!” అన్నాడు శరభయ్య.

ఆయనకు కొడుకు ధోరణి నచ్చడం లేదు. కుర్రాడు కాస్త పెరిగి పెద్దయ్యాడు, ఎందుకులే తిట్టడమని తమాయించుకొన్నాడు. కానీ వాడలా బుస కొడ్తూ నిలబడ్డం నచ్చడంలేదు.

తండ్రి 'వెధవా' అని తిట్టడంతో పుల్లయ్యకు, వాడి బుర్రకు ఒకేసారి కోపం వచ్చేసింది. తోటకు బదులు తన కోపావృక్షం వైపుకు పరుగుతీసాడు.

దారి పొడుక్కీ వాడి బుర్ర ఏదేదో చెప్తూనేవుండింది.

నాన్న చెప్పిన మాటల్ని వినకూడదని, పాటించకూడదని నూరిపోస్తోంది. పెద్దోళ్ళందరికీ బుర్రలుండవని, ఉన్నా అవి తనలా చురుగ్గా, చలాకీగా ఉండవని చెప్తోంది. ముసలి బుర్రలకి పనీపాటా ఉండవని, ఎప్పుడూ ఉసూరుమని మూలుగుతుంటాయని, చలాకీగా వుండే కుర్రబుర్రల్ని చూస్తే వాటికి కన్ను కుడుతుందని, అందుకనే అవెప్పుడూ కుర్ర బుర్రల్ని అవమానించడానికే ఆరాట పడుతుంటాయని చెప్పింది.

ఆ మాటల్ని వింటున్న కొద్దీ పుల్లయ్య కాళ్ళకి వేగం, మనసులో క్రోధం పెరగసాగాయి.

- - - -

# కొండ మీదకు



పుల్లయ్య కూర్చొన్న కొమ్మ మీదకు ఓ పిచ్చుక వచ్చి కూర్చుంది. చిన్ని చిన్ని పుల్లల్లా వున్న కాళ్ళనేసుకొని అటు ఇటు ఆగకుండా తిరుగుతూ అరుస్తోంది.

"ఏయ్ పిచ్చుకా! నీ పేరేంటి?" అని అడిగాడు.

ఏవో అపరిచిత శబ్దతరంగాలు తగలడంతో తికమకపడినట్టుగా గెంతడం, అరవడం ఆపి నిలుచుంది పిచ్చుక.

చెవులు రిక్కించాడు పుల్లయ్య. ఆ క్షణంలో పిచ్చుక మానవ భాషలో మాట్లాడబోతోందేమోనని అనుకొన్నాడు వాడు.

"కిచ్ కిచ్..." అంది పిచ్చుక.

పకపకా నవ్వాడు పుల్లయ్య. "నీ పేరు కూడా పుల్లయ్యేనా! నీకా పేరంటే ఇష్టమేనా?" అన్నాడు.

పిచ్చుక ఈసారి పుల్లయ్యకు వీపు చేసి "కిచ్ కిచ్..." అంది.

"ఆహా...నీకిష్టం లేదా. ఐతే కొండయ్య అని మార్చేసుకో!"

పిచ్చుక పుల్లయ్య వైపుకు తిరగకుండానే మళ్ళీ అరిచింది.

"మీ నాన్న కూడా మా నాన్నలా మొండోడా? అంటే మీ పిచ్చుకల్లో కూడా ఆచారమనేదివుందా! మీ నాన్న దాని మాటలే తప్ప నీ మాట వినడా?" అన్నాడు పుల్లయ్య.

తుర్రుమని ఎగిరిపోయింది పిచ్చుక.

పుల్లయ్యకు బాగా నిరాశ కలిగింది. పిచ్చుకలకి ఏ ఆచారం లేదని అది చెప్పివుంటే వెంటనే వెళ్ళి నాన్నతో గొడవపెట్టుకోవాలని అనుకొన్నాడు.

ఇంతలో పైనుండి "బుస్"మన్న శబ్దమైంది. తలెత్తి చూసాడు.

నాగుపామొకటి జారుతూ, ఆగుతూ నెమ్మదిగా పై కొమ్మ నుంచి దిగుతోంది.

పుల్లయ్యకు భయమేసి ఒక్క గెంతుతో కిందికి దూకాడు. అక్కడి నుండి కొద్దిదూరం పరుగెత్తి ఆవులు మేస్తున్న చోటికి వచ్చాడు.

ఓ చక్కటి, తెల్లటి ఆవు నింపాదిగా నెమరువేస్తూ నేల మీద కూర్చొనివుంది. తోక అదేపనిగా ఆడుతోంది...ఈగల్తో!

పుల్లయ్య దానికెదురుగా కూర్చున్నాడు. ఆవు అరమోడ్పు కన్నుల్తో నెమరువేసుకొంటోంది.

"పుల్లమ్మా!" అని పిలిచాడు పుల్లయ్య.

నెమరువేయడం ఆపేసింది ఆవు.

"అయ్...నీ పేరూ పుల్లమ్మేనా?" అన్నాడు హేళనగా పుల్లయ్య.

ఒక్కసారి తల విదిలించిది ఆవు. మెడలోని గంటలు ఘల్లుమన్నాయ్.

"ఏయ్! నిజంగా? నీ పేరు పుల్లమ్మేనా?"

మరోమారు గంటలు ఘల్లుమన్నాయ్.

"ఓహో! మరి నీకాపేరంటే ఇష్టం లేదు కదా?"

ఈసారీ గంటలు ఘల్లుమంటాయేమో అని ఆశపడ్డాడు పుల్లయ్య. కానీ ఆవు మాత్రం మళ్ళీ అరమోడ్పు కళ్ళతో నెమరువేయడంలో మునిగిపోయింది.

"చెప్పూ..." అన్నాడు పుల్లయ్య.

ఆవు నోరు మాత్రం ఆడిస్తోంది. మాట లేదు. గంటల ఘల్లూ లేదు.

"తొండి..." అన్నాడు పుల్లయ్య.

తన మాట పూర్తవగానే గంటలు చిన్నగా, వినబడీవినబడనట్టుగా శబ్దం చేసినట్టు అనుమానం వేసింది పుల్లయ్యకి.

తొండి పెట్టిన ఆవు మీద కూడా కోపం వచ్చేసింది. తన ఆచారం ప్రకారం చెట్టెక్కెయ్యాలనుకొన్నాడు కానీ అక్కడున్న నాగుపాము గుర్తుకొచ్చి ఆగిపోయాడు.

కోపమొచ్చినా చెట్టెక్కలేకపోవడం పుల్లయ్యను బాధిస్తోంది. అసహనానికి గురి చేస్తోంది. ఏదో పోగొట్టుకొన్నతనాన్ని లోనుండి ఎగదోస్తోంది.

తలెత్తి చూసిన పుల్లయ్యని అల్లంత దూరంలోనే ఉన్న ఓ కొండ శిఖరం పలకరించింది. పుల్లయ్యకు వెంటనే ఎక్కెయ్యాలనిపించింది. చెట్టు కంటే కొండ ఎత్తైంది కదా!

రెండడుగులు ముందుకేసి ఆగిపోయాడు. గుండెలో ఏదో గుబులు ఆలోచనల రూపంలో పుల్లయ్యను చుట్టుముట్టేసింది.

"పుట్టినప్పటి నుండీ పదహారేళ్ళొచ్చేసినా కూడా ఈ పచ్చికబయలు దాటి కొండలకేసి వెళ్ళలేదు. ఊళ్ళో వాళ్ళెవ్వరు కూడా వెళ్లరు. ఎందుకో తెలీదు. పశువుల కాపర్లు కూడా తమ మందల్ని కొండనెక్కనీయరు. ఎందుకో తెలీదు. ఒకవేళ వాళ్ళకి తెలిసినా చెప్పరు."

"అవును. నీకు చెప్పనే చెప్పరు." అంది పుల్లయ్య 'బుర్ర.'

"ఎందుకలా?" అన్నాడు పుల్లయ్య. వాడికి చాలా నిరాశగా ఉంది. ఉక్రోషం కూడా తన్నుకొచ్చేస్తోంది.

"ఎందుకంటే నీ పేరు పుల్లయ్య కనుక. అసలు పుల్లయ్య పేర్లో ఉన్నంత వెర్రిదనం ఇంకే పేర్లో కూడా లేదురా. అదే కొండయ్య అని పెట్టుకొనివుంటేనో...."

పుల్లయ్యలో కోపం కస్సుమంది. వాడి 'బుర్ర' దాన్ని ఎగదోస్తున్నట్టుగా బుస్సుమంది.

పుల్లయ్య అడుగులు చకచకా పడసాగాయి. వాడి కాళ్ళ కింద గడ్డి పరకలు నలిగిపోతున్నాయి. వాటి అంచులకి విరిసిన చిట్టి చిట్టి పూలు చిట్లిపోతున్నాయి. ఆ పూలలోని తేనెను తాగడానికి వచ్చిన చిన్నారి పురుగుల్లో అదృష్టమున్నవి ఎగిరి బ్రతికిపోయాయి, లేనివి నలిగి చచ్చిపోయాయి.

నింపాదిగా నెమరువేస్తున్న ఆవు లేచి నిలబడి "అంబా" అని రంకె వేసింది.

పుల్లయ్య నిదానించి వెనక్కు తిరిగి చూసాడు. తెల్లావు మరోమారు రంకెవేసింది. పుల్లయ్యకు అది అపశకునంలా అనిపించింది. ముందుకెళ్ళకూడదని అనుకొన్నాడు. అంతే, లోపలి 'బుర్ర' బుసలు కొడుతూ - "ముందుకే వెళ్ళరా! నువ్వు కనబడకుండా పోయేసరికి బెంబేలెత్తేస్తాడు మీ నాన్న. దానికి తోడుగా మీ అమ్మ గొడవ గొడవ చేసేస్తుంది. దాంతో మీ నాన్నకి తిక్క కుదుర్తుంది. ఆ తర్వాత నీకు కొండయ్య పేరునే ఖరారు చేస్తాడు. ఆగొద్దు. పద పద!" అంటూ తొందరిస్తోంది.

"మరి ఈ పుల్లావు ఎందుకలా అరుస్తోంది? ఆవులట్లా బేలగా అరవడం మంచి శకునం కాదు గదా?" అని 'బుర్ర'ని అడిగాడు పుల్లడు.

"నీ మొహం! ఆవులెక్కడైనా మనుషుల మెదళ్ళను చదువుతాయా? తలరాతల్ని మారుస్తాయా? ఒకేళ వాటికే అంత తెలివేవుంటే మనుషులుగానే పుట్టేవిగా!" అంది బుర్ర.

"నిజమే!" అని అనుకొన్నాడు వాడు.

"నువ్వు పుల్లయ్యవి గనకనే ఇట్లా పెర్రిమొర్రి ఆలోచన్లు చేస్తావు. అదే కొండయ్య ఐతేనో...."  - రెచ్చగొడ్తోంది 'బుర్ర.'

ముందుకు నడవడానికే నిశ్చయించుకొన్నాడు పుల్లయ్య.

ఆవు మరోసారి అరిచింది. గంటలు ఘల్లుమని మోగాయి.

పుల్లయ్య అడుగులు ముందుకే సాగాయి.

- - - -

# కొండ మీద ఏముంది?



భయం చాలా గొప్పది.

ఒక్క గెంతులో వంద గజాల్ని అవలీలగా దూకేసేవాణ్ణి కూడా పట్టి ఆపేస్తుంది. అలాంటి వాడి చేతా అడుగులో అడుగును వేయిస్తుంది.

పుల్లయ్య ఆటగాడు కాడు. గొప్ప వీరుడూ కాడు. వాడో పదహైదేళ్ళు నిండిన కుర్రవాడు. భయస్తుడు. పిరికివాడు. బొద్దింకను చేత్తో పట్టుకొని పారేయగలిగేంత ధైర్యం మాత్రం కలవాడు.

వాడిప్పుడు ఆ పర్వతపాదం దగ్గర నిలబడి, తలెత్తి, ఆకాశానికి వేసిన నిచ్చెనలా కనబడ్తున్న ఆ కొండను చూస్తూ భయపడిపోతున్నాడు.

భయం గొప్పోళ్ళనే కాదు పిరికోళ్ళనీ కూడా దగ్గరగా తీసుకొంటుంది. అందుకే భయం చాలా గొప్పది.

పైకెక్కేసిన గొప్పోళ్ళు ఎప్పుడు పడిపోతామోనని భయపడ్తుంటే, కిందనే వుండిపోయిన పిరికోళ్ళు ఎక్కబోతే ఏమైపోతుందోనని గాభరాపడ్తుంటారు. భయం తనలో తారతమ్యం లేకుండా చూసుకొంటూనే భయస్తుల తారతమ్యాల్ని బాగా తెలుసుకొని మరీ భయపెడ్తుంది. అందుకే భయం చాలా గొప్పది.

ఇప్పుడు పుల్లయ్యకి ఇంకా బాగా భయం వేస్తోంది.

వాడేమీ తత్వవేత్త కాదు ఇలా భయం గురించి ఆలోచిస్తూ భయపడిపోవడానికి కానీ భయపడుతున్నాడు. పుల్లాయి కారణాలు పుల్లాయిలకుంటాయి మరి!

నిచ్చెనలా నిటారుగా వున్న ఆ కొండ చిటారున ఓ పెద్ద బండ ఉంది. ఆ బండ తన నెత్తిన ఓ పెద్ద చెట్టును మోస్తోంది. వాటిల్ని చూసి పుల్లయ్య భయపడ్తున్నాడు. వాడికి పక్కింటి ముసలమ్మ చెప్పిన 'ఒంటికొమ్ము రాచ్చసుడు, ఒంటికన్ను రాకాసి" గుర్తుకొస్తున్నాయి. అంతేకాదు, మొన్న రాత్రి చెప్పిన కథలో చెట్టు రూపంలో ఉన్న పిశాచి కథానాయకుడి మిత్రుణ్ణి అమాంతం నమిలి మింగేసింది. అందుకే పుల్లయ్య భయపడ్తున్నాడు.

కొండ దాకా వాడి వెంట కులాసాగా ప్రయాణం చేసొచ్చిన 'బుర్ర' ఇప్పుడెక్కడుందో తెలీడం లేదు. ఆ మాటే అనుకొన్నాడు పుల్లయ్య. "బుర్రా!" అని నెమ్మదిగా గొణిగాడు. అలా పిలిచినప్పుడల్లా లోపల్నుంచి ఎప్పుడూ వచ్చే 'బుస్' మనే శబ్దం రాలేదు. ఉన్న ఒక్క తోడూ పలక్కపోవడంతో పుల్లయ్యకు భయం భయంకరంగా పెరిగిపోయింది. దానికి తోడు చుట్టూ నిశ్శబ్దం. ఒక పిచ్చుక గానీ, ఒకే ఒక్క ఆవుగానీ, కనీసం ఓ పాము గానీ లేదు. ఉన్నా కనబడ్డం లేదు.

"అవి కూడా కొండను చూసి భయపడి ఎక్కడికో పోయేసి వుంటాయి. ఎంతైనా కొండ కొండనే." అని అనుకొన్నాడు పుల్లయ్య.

ఆ మరుక్షణంలోనే వాడికి గొప్ప ఊరట కలిగింది.

"అదీ...అందుకే కొండయ్య అనే పేరు కావాలి. నాకు కొండయ్య పేరంటే చానా ఇష్టం. ఇలాంటి కొండలంటే కూడా చానా ఇష్టం. ఈ కొండల్ని మా నాన్న తుండుగుడ్డ కాదు గదా పెద్దగాలి కూడా ఏం చెయ్యలేదు." అని అనుకొన్నాడు.

అలా అనుకోగానే కొంచెం ధైర్యం గుండెలో నిండినట్లయింది. వాడి పొగడ్తకు కొండ కూడా పొంగిపోయిందేమో ఓ కోయిల కూతను వినిపించింది. ఆవు అరచినప్పుడు పుట్టి, అడుగడుగునా కంగారు పెట్టిన అనుమానం ఆ కోయిల కూతతో కాస్త కంగారును తగ్గించుకొన్నట్టుంది, పుల్లయ్య కాళ్ళు వణకడం ఆపాయి.

కోయిల కూత శుభ శకునంగా అనిపించింది.

అడుగు ముందుకు వేసి కొండ మీద కాలుపెట్టబోయాడు కానీ ఏదో గుర్తొచ్చి 'బుర్రా!' అని పిలిచాడు. ఊహూ...ఎక్కడా దాని చప్పుడే లేదు. ఏం చెయ్యాలో వాడికి తోచలేదు. ఇంతకాలం 'బుర్ర' లేకుండా తను ఏ పనీ చెయ్యలేదు. ఒక్క అడుగు కూడా కదపలేదు. ఇప్పుడేమో అదెక్కడుందో తెలీడం లేదు. ఐనా ముందుకు వెళ్ళాలనే నిశ్చయించుకొన్నాడు.

మరోమారు కొండ కేసి చూస్తే వాడికి ఓ కొత్త భావం పుట్టుకొచ్చింది. కొండంటే గౌరవం కలిగింది. వంగి దండం పెట్టాడు. ఒక చల్లటి పిల్లగాలి పుల్లయ్యను తాకింది. ఆ గాలితో బాటూ ఏదో కొత్త పరిమళం తగిలీ తగలనట్టుగా తగిలింది.

ఇప్పుడు భయం స్థానంలో విశ్వాసం వచ్చి నిల్చుంది. పుల్లయ్య కాలు కదిపి కొండ ఎక్కసాగాడు.

- - - -

# కొండ మీద ఏదో ఉంది!



కొండనెక్కడం చెట్టెక్కినంత సులభం కాదు.

మొదటిసారిగా ఎక్కుతున్నాడు కదా, చాలా కష్టపడుతున్నాడు.

గస పోసినప్పుడల్లా ఏదైనా బండరాయి పైన కూర్చొని ఎంత ఎత్తు ఎక్కాడో చూసుకొంటున్నాడు. చాలా కొంచమే ఎక్కినట్టు అనిపిస్తోంది. ఎందుకంటే బయల్దేరేముందు తనకు అపశకునం పలికిన తెల్లావు స్పష్టంగా కనబడ్తోంది. కొండ చిటారున వున్న చెట్టు ఇంకా చిన్నదిగా కనబడ్తోంది.

కొన్ని రాళ్ళు, కొన్ని చెట్లు, ఎన్నో పొదలు, వింత వింత పూలు, వాటి చుట్టూ తిరిగే రంగురంగుల పురుగులు. నెత్తి మీద మెరుస్తున్న సూర్యుడు. ఒకదాన్నొకటి తరుముకుంటూ పారిపోతున్న మబ్బులు. ఆకాశంలో ఉంటూనే కొండకు ప్రదక్షిణలు చేస్తున్న గద్దలు.

“కొండ ప్రపంచం కొత్త ప్రపంచం” అనుకొన్నాడు పుల్లయ్య.

రెండు నిముషాలు కూర్చొని, గుండెల నిండుగా గాలి పీల్చుకొని మళ్ళీ కాళ్ళకు పని చెప్పాడు.

ఎంతసేపు అలా ఎండలో నడిచాడో తెలీదు. బాగా దప్పికేస్తోంది. చెట్లూ, పూలు, గాలీ, రాళ్ళూ – అన్నీ ఉన్నా కొండపై నీళ్ళు లేవన్న విషయాన్ని గుర్తించాడు పుల్లయ్య. ఆ ఆలోచనతో దప్పిక ఎక్కువైంది. అప్రయత్నంగా నాలుకతో పెదాల్ని తడుపుకొన్నాడు. బలవంతంగా గుటక వేసి నోట్లోని ఎంగిలిని మింగాడు.

ఇంత జరుగుతున్నా అడుగులు వేయడం మాత్రం ఆపలేదు.

ఇంకాస్త సమయం గడిచింది. అప్పటిదాకా తుప్పల మధ్యనే నడిచివస్తున్న వాడికి ఎడంవైపున, కొద్ది దూరంలో ఒక చెట్టు కనబడింది. వాడి కంటే కాస్తంత పొడవుగా ఉంది. దాని క్రింద చల్లటి నీడవుంది. అక్కడ కొద్దిసేపు కూర్చొంటే

దప్పిక తగ్గుతుందేమోనని అనుకొన్నాడు. జాగ్రత్తగా ముళ్ళపొదల్ని దాటుకొని చెట్టు నీడకు చేరుకొన్నాడు. చెట్టు మొదలుకి జారిగిల బడి కళ్ళు మూసుకొన్నాడు.

మామూలుగా కళ్ళు మూసుకొంటే చీకటి కమ్మినట్టవ్వాలి. కానీ ఇప్పుడు మూసిన కళ్ళ వెనక వెలుగు పరుచుకొనేవుంది. ఆశ్చర్యపోయి కళ్ళు విప్పి చూసాడు.

ఎదురుగా ధగధగా మెరుస్తూ సూర్యుడు కనబడ్డాడు.

"ఓహో! సూర్యుడికి ఎదురుగా కూర్చొని కళ్ళు మూసుకుంటే చీకటి కమ్మదా?" అని అనుకొంటూ మళ్ళీ కళ్ళు మూసుకొన్నాడు.

ఆ కళ్ళ వెనుక ఉండే వెలుగు భలేగా ఉంది వాడికి. కళ్ళను ఇంకా గట్టిగా, బాగా బిగించి మూసాడు.

అంతే.....

ఏదో ఒక ఆకారం దగ్గరగా కనబడినట్టైంది. గుండె వేగంగా కొట్టుకోసాగింది. దాంతో కంగారు పడి కళ్ళు తెరిచాడు.

తెరిస్తే ఏముంది! ఏ ఆకారమూ లేదు. ఆకాశమూ, సూర్యుడూ తప్ప.

వాటిల్ని చూసాక గుండె దడ తగ్గినట్టు అనిపించింది. ఇక అక్కడే కూర్చోవడానికి మనసు రాక లేచాడు. చకచకా ముందుకెళ్ళి నడవాల్సిన దారిలో నడవసాగాడు.

"ఏమిటది? అసలేమిటో కూడా అర్థం కాలేదు." అని అనుకొన్నాడు. ఇంకొద్దిసేపు కళ్ళు మూసుకొనివుంటే అర్థమయ్యేదేమోనని ఊహించుకొన్నాడు. అనవసరంగా భయపడి కళ్ళు తెరచినందుకు తనని తాను తిట్టుకొన్నాడు.

అలా కొద్దిగా పైకి ఎక్కాడో లేదో సన్నగా ఓ శబ్దం వినవచ్చింది.

పుల్లయ్య చెవులు తమంత తాముగా నిక్కబొడుచుకొన్నాయి. ఆ వినబడ్తున్న శబ్దాల్ని శ్రద్ధగా విన్నాడు.

"అయ్....నీళ్ళు!"

అప్పుడు గుర్తుకొచ్చింది దాహం.

చకచకా కదిలాడు. కుడివైపుకు నాలుగడుగులు వేసేసరికి కనబడిందా చిన్న జలధార.

అడ్డంగా ఒకటి, చేరో వైపు వాలుగా ఇంకో రెండు రాళ్ళు ఉండి, వాటి మధ్యనున్న కంతలోనుంచి పారుతూ బైటికొస్తోంది నీరు. బైటికి రావడమే ఆలస్యం క్రిందకు జారి అక్కడున్న కుంటలోకి నిండుతోంది.

నీళ్ళు తాగాలంటే నిలువునా క్రిందకు దిగాలి.

క్రిందకు వెళ్ళాలంటే, చెట్లనీ, బైటకు కనబడుతున్న చెట్ల వేళ్ళనీ పట్టుకొని కనీసం ఆరేడు అడుగులు దిగాలి. ఆలోచనలో పడ్డాడు ఫుల్లయ్య. ధైర్యం చేసి ఒక చెట్టు కొమ్మను పట్టుకొని కాలు క్రిందకు జార్చాడు. పట్టు దొరక్క సర్రుమని జారింది కాలు. కొమ్మను గట్టిగా పట్టుకొని ఒక నిముషం వేళ్ళాడి, ఆపై కాలును జాగ్రత్తగా పైకి లాక్కున్నాడు. మొదటి అనుభవమే ఒళ్ళు గగుర్పొడిచేట్టు చేయడంతో క్రిందకు దిగే ఆలోచనను మానుకొన్నాడు.

మర్చిపోయిన దప్పిక నీళ్ళు కనబడ్డంతో గుర్తుకొచ్చి వాణ్ణి నెమ్మదిగా ఉండనీయడం లేదు. ఎలాగైనా సరే నీళ్ళు తాగాలని దేహం తహతహలాడుతోంది.

ఒక నిముషం చుట్టుప్రక్కల్ని పరీక్షగా చూసాడు. ఊహూ...నీళ్ళు తాగాలంటే దిగనైనా దిగాలి లేదా దాహాన్ని మర్చిపోవాలి. ఫుల్లయ్యకి చాలా నిరాశ కలిగింది. కంటికెదురుగా నీళ్ళున్నా తాగలేకపోతున్నాడు కదా! అంతకంటే వ్యథ ఏముంటుంది? అదే ఇంట్లోనైతే దాహమని అడగ్గానే అమ్మో, నాన్నో చెంబు నిండా నీళ్ళిచ్చేవాళ్ళు.

బాధగా నిట్టూర్చి దిక్కులు చూసాడు ఫుల్లయ్య. ఉన్నట్టుండి వాడి కళ్ళకు ఏదో కనబడింది.

వాడు నిలబడివున్న చోటు నుండి ఎడమవైపుగా తుప్పలు, పొదల్ని దాటుకొని చుట్టుకొంటూ వెళ్తే జలధార మూలానికి చేరుకోవచ్చు. అక్కడి నుండి కాస్త జాగ్రత్తగా వంగితే చేత్తో పట్టుకొని నీళ్ళు తాగొచ్చు. మర్చిపోయిన ఉత్సాహం మళ్ళీ పలకరించింది. చకచకా ఆ దారిలోకి మళ్ళాడు ఫుల్లయ్య.

అనుకొన్నదానికంటే ఎక్కువే ఉన్నట్టుంది దూరం. అప్పటి దాకా కుడివైపున కనబడుతూవుండిన జలధార ఇప్పుడు మాయమైపోయింది. నీళ్ళు పడుతున్న శబ్దం కూడా వినబడ్డంలేదు. ఫుల్లయ్యకు కంగారు పట్టుకొంది. ఆగిపోయాడు.

“ముందుకెళ్లాలా? వెనక్కు తిరగడం మేలా?” అన్న తర్కంలో పడిపోయాడు.

ముందుకెళ్తే నీళ్ళు దొరుకుతుంది. వెనక్కు మళ్ళితే దప్పిక మిగులుతుంది.

ముందుకెళ్ళాలంటే చాలా ధైర్యం కావాలి. దారి తప్పినా తప్పొచ్చు. అదే వెనక్కు తిరిగితే కొండ దిగి ఇంటికెళ్ళి బిందెడు నీళ్ళు తాగొచ్చు. ఏది మేలు? వెంటనే నిర్ణయించుకోవాలి.

పుల్లయ్య ఆలోచించసాగాడు.

ఇప్పటి వరకూ వాడికి సొంతగా ఆలోచించి నిర్ణయం తీసుకొనే అవసరమే రాలేదు. అన్నీ అమ్మా నాన్నలే చూసుకొనేవారు. వాడికి ఆజ్ఞలు వేసే అలవాటు మాత్రమే వుంది. మిరపకాయ బజ్జీ తినాలని అనిపిస్తే అమ్మకు చెప్పేవాడు. తట్టలో వేడి బజ్జీలు వచ్చేసేవి. పండగరోజుకి ఎరుపు రంగు చొక్కా కావాలని నాన్నను అడిగేవాడు. వచ్చేసేది. అవి ఎలా వస్తాయన్న ఆలోచన ఎప్పుడూ కలగలేదు. అడిగితే చాలు వచ్చేస్తాయని మాత్రమే వాడికి తెలుసు.

ఒకసారి నాన్న వాడికిచ్చిన పైసల్తో అంగడికి వెళ్లి బజ్జీలు కొనాలనుకొన్నాడు. వెళ్ళి కొంటే ఒకటే బజ్జీ వచ్చింది. ఇంకో బజ్జీని ఇవ్వమని అడిగాడు. "ఏరా! ఒక్క బజ్జీ చెయ్యాలంటే ఎంత ఖర్చో, కష్టమో తెలుసునా?" అని అడిగిన అంగడివాణ్ణి తిట్టుకుంటూ ఇంటికొచ్చాడే గానీ పోయిన వారం ఇంట్లో తను తిన్న ఇరవై బజ్జీలకు నాన్న ఎన్ని పైసల్ని ఖర్చు చేసాడన్న ఆలోచన రాలేదు. అమ్మ ఎంతసేపు కష్టపడిందోనన్న ఆలోచనా రాలేదు.

అసలు వాడికి నిర్ణయం అంటే ఏమిటో, ఆలోచన అంటే ఏమిటో తెలీదు. పాపం అది వాడి తప్పు కాదు.

పుల్లయ్యకి ఆలోచనా దృక్పథం, నిర్ణయశక్తీ ఇప్పుడు కూడా కలగడం లేదు. వాడి సమస్యల్లా నీళ్ళు తాగడమే.

ఆలోచిస్తున్న వాడికి కాస్త దూరం నుంచి కోకిల గొంతు వినబడింది.

"మంచి శకునం...ముందుకే వెళ్తా" అనుకొంటూ ముందుకు నడిచాడు.

ఇరవై అడుగులు వేసాడో లేదో ఎదురుగా కనబడ్డదాన్ని చూసి చిన్నగా కేక పెట్టాడు.

ఎదురుగా నీళ్ళు.

అది ఇంతకు ముందు వాడు చూసిన జలధార కాదు. చిన్న నది. గలగలా పారుతోంది. అలా పారి, పారి ఆ రాళ్ల గుండా ప్రవహించి జలధారలాగా మారుతోంది. చచ్చేంత సాహసం చేసి నీళ్ళు తాగాలేమోనని సతమతమౌతున్న వాడికి అనుకోకుండా ఎదురుపడి స్వాగతం పలుకుతున్న సెలయేరును చూసి ప్రాణాలు లేచి వచ్చాయి.

ఎలాంటి తుప్పలూ, మొక్కలూ లేని నేల మీద పరుగెడుతూ నీళ్ళ దాకా వెళ్ళాడు. తొంగి చూస్తే సెలయేరు అడుగునవున్న గులకరాళ్ళు కనబడ్డాయి. మోకాలి కంటే కొద్దిగా తక్కువ ఎత్తులో ఉన్నాయి నీళ్ళు. ధైర్యంగా దిగి, దోసిళ్లతో పట్టి కడుపు నిండా తాగాడు.

ఒడ్డున కూర్చొని నవ్వుకోసాగాడు. చేతిలోకి రాళ్లు తీసుకొని నీటిలోకి విసిరాడు. కొన్ని గడ్డిపోచల్ని పీకి గాల్లోకి ఎగరేసాడు. అంతలో గుర్తుకొచ్చింది...తాను నడిచి వచ్చింది సగం దారి మాత్రమేనని.

మరోసారి నీళ్ళు తాగి వచ్చిన దారిలోనే హుషారుగా నడుస్తూ ప్రధానమార్గానికి వచ్చాడు. ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా చకచకా పైకి ఎక్కసాగాడు.

మధ్యాహ్నం వేళకి ముప్పాతిక దూరం నడిచేసాడు. ఇక నడవాల్సిన దారి....ఎక్కాల్సిన ఎత్తు కొద్దిగానే ఉంది. ఆ కొండ చిటారున కనబడే ఒంటరి బండరాయిని, ఒంటి చెట్టునూ చూసేసి త్వరగా దిగెయ్యాలి. చీకటి పడేలోగా బయలును దాటి, తనకిష్టమైన కోపం చెట్టును దాటి ఇంటికెళ్ళిపోవాలి.

ఆపై ఆ రాత్రి కథలు చెప్పే ముసలమ్మకు తన సాహసాల్ని బాగా భయం పుట్టేట్టుగా చెప్పాలి. దాంతో అవ్వ ఆ రాత్రంతా నిద్రపోకుండా మేలుకొనేవుండాలి. ఇలా ఊహించుకొంటూ, ఉత్సాహంతో గబగబా రాళ్ళను ఎక్కేస్తున్నాడు.

ఒకేవొక్క క్షణంలో....

ఏం జరిగిందో తెలుసుకొనేలోగా పట్టుదప్పి జారిపోయాడు పుల్లయ్య.

ఏవేవో వొంటికి కొట్టుకొంటున్నాయి. కొన్ని పొడిచినట్టుగా, కొన్ని చీల్చినట్టుగా, కొన్ని మోదినట్టుగా....నొప్పి, మంట, బాధ...భయం!

దొర్లుతూనే ఉన్నాడు. చాలాసేపే దొర్లినట్టు అనిపిస్తోంది. దొర్లడం ఆగేసరికి ఎక్కడున్నదీ వాడికి అర్థం కాలేదు.

లేవడానికి ప్రయత్నించాడు. ఒళ్ళు సహకరించలేదు. పక్కనేవున్న ఒక పెద్దరాయిని పట్టుకొని నెమ్మదిగా లేచాడు. ఇంకా కళ్ళు బైర్లు కమ్మినట్టుగానే ఉంది. వెలుతురు తక్కువగా ఉన్నట్టు అనిపిస్తూ ఏదీ స్పష్టంగా కనిపించడం లేదు.

ఒళ్ళు బాగా నొప్పెస్తోంది. నిల్చో లేక క్రింద కూర్చున్నాడు. అప్పుడు కనబడింది....కుడి మోకాలి పైన ఎర్రగా, జిగటగా, సలుపుతూన్న గాయం. వణుకుతున్న చేత్తో దాన్ని తాకాడు. చర్రున మంటపుట్టింది. "స్..స్..స్.." అంటూ చెయ్యిని తీసేసాడు.

చేతుల్ని చూసుకొన్నాడు. అక్కడక్కడా గీరుకుపోయిన గుర్తులు...రక్తపు మరకలు.

గాయాల వల్ల పుట్టుకొచ్చిన నొప్పి సుడులు తిరుగుతూ శరీరాన్నంతా వణికిస్తోంది. దానితో బాటూ భయం కూడా మెలికలు తిరిగే సుడిగాలిలా గుండె నిండుగా తిరుగుతోంది.

దృష్టి ఇంకా సర్దుకోలేదు. చుట్టుపక్కలున్నవన్నీ అస్పష్టంగానే కనబడుతున్నాయి.

ఎంతో హుషారుగా ఉన్న వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఇప్పుడంతా నొప్పులు, గాయాలు, భయాల మయమైపోయింది.

పుల్లయ్యకు ఏడుపొచ్చింది.

రాదు మరి!

ఇంట్లో పంటి క్రిందకు రాయొచ్చినా, కాలిలోకి ముల్లు దిగినా అమ్మో నాన్నో పరుగెత్తుకొస్తారుగా!

ఒకసారి ఏమైందంటే – పుల్లయ్య, వాడి నేస్తులూ కలిసి గోలీలు ఆడుతున్నారు. ఆటలో ఒకడు మోసం చేస్తే ఇంకొకడు గొడవ పడ్డాడు. ఆ ఇద్దరితో పాటు మిగతావాళ్ళందరూ చేరారు. వాళ్లలో వాళ్ళు తన్నుకొంటూ, కొట్టుకొంటూ వచ్చి పుల్లయ్య మీద పడ్డారు. పాపం వాడి పెదవి చిట్లిపోయింది. ఒక చెంప మీద రాళ్ళు గుచ్చుకొని రక్తం కారింది. ఏడుస్తూ ఇంటికొచ్చాడు. నాన్నకు కోపమొచ్చి పిల్లలందరినీ తిట్టి తరిమేసాడు. అమ్మైతే కళ్ళల్లో నీళ్ళు దూకుతుంటే పెదవికి, బుగ్గలకీ వెన్న రాసింది. ఇంకేదో మందు తెచ్చి పూసింది. ఒళ్ళు తడిమి చూస్తూ జ్వరమేమైనా వచ్చిందేమోనని రాత్రంతా మేలుకొనేవుంది.

పుల్లయ్యకు అమ్మ గుర్తుకొచ్చి బావురుమన్నాడు. కానీ ఎవరూ వాడి ఏడ్పు వినలేదు. కొండ అలాగే వుంది. సూర్యుడు మెరుస్తూనేవున్నాడు. మబ్బులు ఏమీ పట్టనట్టు పోతునే వున్నాయి. ఆ నిర్లక్ష్యం చూసిన వాడికి నిజంగానే, గట్టిగానే ఏడుపొచ్చింది. పాపం నిజంగానే, గట్టిగానే ఏడ్చాడు కూడా.

"కొండ ప్రపంచం చాలా దయలేని ప్రపంచం" అని తిట్టుకొన్నాడు.

- - - -

# ఎవరో వచ్చారు!

ఏడుపు చాలా మంచిది.



లోపలేవున్న దిగుళ్ళన్నీ కొట్టుకుపోతాయి. అదిమిపట్టిన గుబుళ్ళన్నీ తేలిపోతాయి. బరువుతో అణచివేసే బాధలన్నీ అడుగంటా మునిగిపోతాయి.

పుల్లయ్య ఏడుస్తున్నాడు. అప్రయత్నంగా కళ్ళు మూసుకొన్నాడు. అప్రయత్నంగానే కళ్ళను గట్టిగా బిగించాడు.

అదే అంతకు మునుపు కనబడ్డ ఆకారమే మళ్లీ కనబడింది. మీదకు వచ్చేస్తోంది. చాలా దగ్గరకొచ్చేస్తోంది.

చటక్కున కళ్ళు తెరచాడు. నిజంగానే ఎదురుగా ఒక ఆకారం వుంది.

కళ్ళు మూస్తే మాత్రం కనబడి, తెరవగానే మాయమయ్యే ఆకారం ఇప్పుడు కళ్ళు తెరచినా పోకుండా నిలబడేవుంది.

మనుషులే ఉండరని అనుకొన్న స్థలంలో తన దగ్గరకు వస్తున్న ఆ వ్యక్తిని చూసి భయంతో బిగుసుకుపోయాడు వాడు.

అంతే....పుల్లయ్యకు స్పృహ తప్పింది.

పుల్లయ్య ఏడుపులో నిజాయితీ ఉంది కాబోలు అతను ఎక్కడినుండో వచ్చి ప్రత్యక్షమయ్యాడు. పలకరించేలోపు మెలకువ తప్పిన పుల్లయ్యను భుజాన వేసుకొని చకచకా వెళ్ళిపోయాడు.

- - - -

“భయపడకు!” అన్నాడు అతను.

పుల్లయ్యకు మరింత భయం పట్టుకొంది.

“నువ్వెవరు?” అని అడిగాడు.

నవ్వాడు అతను. “నీ పేరు చెప్పు!” అన్నాడు.

“పుల్లయ్య.....”

“ఆహా...బావుంది.” అన్నాడు. ఆ అన్నవాడు అక్కడ వుండకుండా గుడిసె బైటకు వెళ్ళాడు.

ఇంతసేపూ ఎక్కడుందో, ఏమైపోయిందో తెలీదు గానీ టకటకా వచ్చేసింది పుల్లయ్య ’బుర్ర’

“చూసావా రా! ఈ పరిచయంలేని కొత్త ముసలి బుర్ర కూడా నిన్ను ఏడిపిస్తోంది. పుల్లయ్య అన్న పేరు బాగుందంట...బాగుందంట...హూ” అంది.

పుల్లయ్యకు తన ’బుర్ర’ మీద కోపమొచ్చింది.

“ఇంతసేపూ ఎక్కడికెళ్ళావ్?” అన్నాడు.

“అదేమిరోయ్! నీతో పాటే కొండనెక్కాను కదా?” అంది ’బుర్ర.’

“మరైతే కొండనెక్కే ముందు పిలుస్తే పలకలేదే? నీళ్ళు తాగడానికి నేను అవస్థలు పడుతున్నా నువ్వు మాట్లాడలేదే?” అని నిలదీసాడు.

“ఓహో! అదా! అవన్నీ చిన్న చిన్న విషయాలు. అట్లాంటివాటిల్లోకి దూరితే నా పరువు పోతుంది. అందుకనే పలకలేదు.”

పుల్లయ్యకు మొదటిసారిగా తన ’బుర్ర’ పైన నమ్మకం తగ్గింది. కొండ ఎక్కడం చిన్న విషయమా? నీళ్ళు లేకుండా దప్పికతో అల్లాడ్డం చిన్న విషయమా? – ఇవి చిన్న విషయాలు కావని అనిపించింది వాడికి.

“ఇదో! నిన్నే! ఆ ముసలి బుర్ర లోపలికి రాగానే దులిపెయ్. ఏరా ముసలివాడా, పుల్లయ్య అన్న పేరు నీకు నచ్చిందా? ఏం మీ నాన్న అంతకంటే దరిద్రమైన పేరు పెట్టాడా నీకు? అని నిలదీయ్. అసలు ఈ వెధవ పేరులో వాడికంత నచ్చిన సంగతేంటో కనుక్కో. ఆ తర్వాత ఏం చెయ్యాలో నేను చెప్తా. అదిగో వాడొస్తున్నాడు...అడిగెయ్ అడిగెయ్!” అంది ’బుర్ర.’

పుల్లయ్య మాట్లాడలేదు.

లోపలికొచ్చిన ఆ వ్యక్తిని చూసాడు. పెద్దవాడే...నాన్న కంటే పెద్దవాడే. తెల్లటి మీసాలు, తెల్లటి చిన్న గడ్డం కలిసిపోయున్నాయి. నెత్తి మీద సగం దాకా జుత్తు లేదు. మిగతా జుట్టును వెనక్కి దువ్వి ముడివేసుకొన్నాడు. నడుం నుండి మోకాలి దాకా గోచీ వేసి పంచె కట్టుకొన్నాడు. భుజం మీద కండువా ఉంది.

"ఏం భయపడకు. దెబ్బలు చిన్నవే. తొందరగా తగ్గిపోతాయ్." అంటూ వచ్చి ఏదో మందు పూయడం మొదలెట్టాడు. ఆ మందు తగిలిన చోటంతా చల్లగా, హాయిగా ఉన్నట్టు అనిపిస్తోంది వాడికి. దాంతో కొద్దిగా భయం తగ్గింది. కానీ దాని స్థానంలో అనుమానం వచ్చి కూర్చుంది.

"ఈ కొండపైన ఈ ముసలివాడు గుడిసె వేసుకొని ఎందుకుంటున్నాడు? నేను పడిపోయినప్పుడు కచ్చితంగా అక్కడే ఎలా ఉన్నాడు? ఒకవేళ ఈ మనిషి దెయ్యమా? పిశాచమా?"

చివరి ఆలోచనతో మళ్ళీ భయం వచ్చి కూర్చుంది. దాంతో బాటు విసుగు కూడా వచ్చింది పుల్లయ్యకి. అందుకే నేరుగా అడిగేసాడు.

"నువ్వెవరు? ఇక్కడేం చేస్తున్నావు?"

"నేనా....నేను వో సన్యాసిని. నాకెవ్వరూ లేరు. ఒంటరివాణ్ణి. నాకు ఒంటరిగా ఉండడం చాలా ఇష్టం. అందుకనే ఈ కొండ పైనే ఉంటాను."

పుల్లయ్య మరిన్ని ప్రశ్నలు వేసే అవకాశం ఇవ్వకుండా అన్నీ చెప్పేసాడు ఆ సన్యాసి. ఎదురుగా ఉన్నది మాంత్రికుడు కాడని సన్యాసని తెలుసుకొన్న పుల్లయ్య భయం కొంచెం తగ్గింది.

"నేను వెళ్తా" అన్నాడు.

"ఎక్కడికి? నువ్విప్పుడు కదిలావంటే దెబ్బలకు చీము పడుతుంది. దాంతో నొప్పి బాగా పెరిగి నువ్వు తట్టుకోలేవు. ఈ రాత్రికి ఇక్కడే ఉండిపో. ఈ పసరు రాత్రి పూటే బాగా పని చేస్తుంది. పొద్దునకల్లా దెబ్బలు దాదాపు మానిపోతాయ్. అప్పుడు కొండ దిగు." అన్నాడు సన్యాసి.

పుల్లయ్యకు మళ్ళీ దిగులు పట్టుకొంది. "వీడు మాంత్రికుడే. రాత్రి అమ్మోరుకి నన్ను బలిస్తాడు." అని అనుకొన్నాడు.

అంతలో ఆ సన్యాసి గుడిసెలోని ఓ మూలకు వెళ్ళాడు. అదే అవకాశంగా లేచి పారిపోబోయాడు పుల్లయ్య. కానీ ఒళ్ళు, కాళ్ళు సహకరించలేదు. బోర్లా పడ్డాడు. ఆ చప్పుడుకు తిరిగి చూసిన సన్యాసి పరుగున వచ్చి చాలా జాగ్రత్తగా వాణ్ణి లేపాడు.

"భయపడొద్దు. నేను సన్యాసిని...మాంత్రికుణ్ణి కాను. నిన్నేమీ చెయ్యను. గంజి కాచి ఇస్తాను. తాగేసి హాయిగా పడుకో." అన్నాడు.

గుడిసె వాకిలి దగ్గరనే ఉన్న తొండ తలను కిందికీ పైకీ ఆడించింది. పుల్లయ్య దాన్ని చూసాడు. సన్యాసి సహాయంతో కుంటుకుంటూ వచ్చి మంచం అనబడే చెక్క బల్ల మీద కూర్చున్నాడు.

సన్యాసి అంతకు ముందువెళ్ళిన మూలకే వెళ్ళి పొయ్యి వెలిగించే పనిలో పడ్డాడు. అతను పొయ్యి వెలిగించడాన్ని చూడసాగాడు పుల్లయ్య. వాడికి అమ్మ గుర్తుకొచ్చింది.

"అయ్యో! మధ్యాన్నం భోంచేసే వేళ దాటిపోయింది. అమ్మ కంగారుపడ్తోంటుంది. నేను వెళ్లలేదు కదా పాపం. ఎక్కడని వెతుకుతుంది? నాన్న కూడా పాపం. అయ్యో...నాన్నకి నా చెట్టు తెలీదే. అసలు ఎవ్వరికీ ఆ చెట్టు గురించి తెలీదు. మరి అమ్మా నాన్న ఇప్పుడేం చేస్తారు. నేను ఈ కొండ మీద సన్యాసి గుడిసెలో ఉన్నట్టు వాళ్ళ కెట్లా తెలుస్తుంది? నేను ఇక్కడికి రావడం చూసింది పిచ్చుక, ఆవు మాత్రమే. పాపం అవెట్లా చెప్తాయి? వాటికి మన భాష రాదు, నా ఇల్లు తెలీదు. పాపం అమ్మ...నాన్న"

తెలీకుండానే పుల్లయ్య కళ్ళల్లో నీళ్ళొచ్చాయి. గొంతులో వెక్కిళ్ళొచ్చాయి. గట్టిగా చప్పుడు చేసాయ్. అవి సన్యాసికి వినబడ్డాయ్.

పొయ్యి ముట్టించే పనిని ఆపి "ఏడవద్దు పుల్లయ్యా! అమ్మా నాన్నాలు కంగారుపడ్తారని కదా నీ బాధ. నువ్వు ఇప్పుడిట్లా ఒళ్లంతా దెబ్బల్తో వెళ్ళావనుకో నీకూ బాధ, వాళ్ళకూ బాధ. కాబట్టి నువ్వు బాగా నిద్రపో. పొద్దున్నే నిన్ను కొండ కిందిదాకా నేను తీసుకెళ్తా." అన్నాడు సన్యాసి.

ఇక చెయ్యడానికి ఏమీ లేక, ఆలోచించే శక్తి లేక కళ్ళు మూసుకొన్నాడు పుల్లయ్య.

అప్పటి దాకా ఓపికతో చూస్తున్న వాడి 'బుర్ర' చర్రున లేచింది. 'ఒరేయ్! నేను చెప్పిందేంటి నువు చేస్తున్నదేంటి? ఆ ముసలి బుర్రను కడగమంటే ఏడుస్తావా? ఛీ" అంది.

ఆశ్చర్యంగా దాని గొంతు పుల్లయ్యకు వినబడలేదు. ఎందుకంటే వాడికి అప్పటికే బాగా నిద్రపట్టేసింది. వాడు మొట్టమొదటి సారిగా 'బుర్ర'ను పట్టించుకోలేదు.

- - - -

# భయాలు, నిజాలు, కోపాలు



నిద్ర చాలా అవసరం.

నిద్రకు, భయానికీ ఎప్పుడూ చుక్కెదురే. అది వుంటే ఇది వుండదు. ఇది వుంటే అదీ వుండదు. మేలుకున్నంతసేపూ కంగారు పెట్టే 'బుర్ర' కూడా నిద్రలో గమ్మత్తుగా నిద్రపోతుంది.

నిద్రను దులిపేస్తూ మెలకువ వచ్చేస్తుంది.

మెలకువ కూడా చాలా ముఖ్యం. అది లేకపోతే జీవితంలో మత్తు తప్ప గమ్మత్తు ఉండదు. మెలకువకి, నిద్రకీ మళ్ళీ చుక్కెదురు. ఒకదాన్నొక్కటి తరుముకుంటాయి. మెలకువలో ఉన్న చిక్కల్లా 'బుర్ర'తోనే.

ఇప్పుడు ఫుల్లయ్యకి నిద్ర ముగిసి మెలకువొచ్చింది...'బుర్ర'తో సహా.

"అబ్బాయ్! నీళ్ళతో నోరు పుక్కిలించి రా. జావ తాగుదువుగానీ!" అన్నాడు సన్యాసి, వాడి మెలకువ కోసమే ఎదురుచూస్తున్నట్టుగా.

సన్యాసి సాయం పట్టగా నోరు పుక్కిలించడానికి గానూ గుడిసె బైటకు వచ్చాడు ఫుల్లయ్య. చుట్టూ ఉన్న చిమ్మచీకటిని చూసి విస్తుపోయాడు. గాలి అంతా కీచురాళ్ళ శబ్దాలతో నిండిపోయింది. ఆగి ఆగి "గూ గూ" అనే అరుపులు వినబడుతున్నాయి.

"ఆ గూ గూ చప్పుడేమిటి?" అన్నాడు. వాడికింకా సన్యాసిని ఏమని పిలవాలో అర్థం కావడంలేదు. అందుకనే ఏమీ పిలవలేదు.

"అదా! గుడ్లగూబ" అన్నాడు.

ఒళ్ళు ఝుల్లుమంది ఫుల్లయ్యకి. “నీకు భయం లేదా?” అన్నాడు లోపలికి వస్తూ.

ఒక చేత్తో ఫుల్లయ్యనికి పొదివిపట్టుకొని మరో చేత్తో తలుపు మూస్తూ నవ్వాడు సన్యాసి.

“ముందు జావ తాగు. ధైర్యమొస్తుంది.” అన్నాడు.

“నువ్వు జావను మంత్రించి ఇస్తావా?” ఆశ్చర్యంగా అడిగాడు ఫుల్లయ్య.

“లేదు. అది వుట్టి జావనే. అందులో ఏ మంత్రమూ లేదు.” అన్నాడు సన్యాసి.

“మరి ఇంట్లో నేను కూడా చాలా చాలా అంబలి, జావ...ఇంకా...పాయసం కూడా తాగుతాను. కానీ భయం పోదు.”

“ఎందుకలా?” అన్నాడు సన్యాసి వాణ్ణి చెక్క మంచం మీద కూర్చోబెడుతూ.

“మా వీధిలో కుక్క మొరిగితే నేను అమ్మను కరుచుకొని పడుకొంటాను. నాకు రాత్రి పూట వచ్చే చప్పుళ్లంటే చాలా భయం. మా ఇంట్లో ఒక ఎలుకవుంది. అది రాత్రంతా చెక్క పెట్టెల్ని గీకుతూ ఉంటుంది. అదన్నా భయమే.” అన్నాడు వాడు.

“హాహాహా...ఇంకా...” అన్నాడు సన్యాసి.

“ఇంకా అంటే చాలా భయాలున్నాయి. గోడ మీద బల్లి నా పైన పడిపోతుందేమోనని ఒక భయం. ఉయ్యాల ఊగుతుంటే తాడు తెగిపోతుందేమోనని భయం. ఇట్లా చాలా ఉన్నాయ్. ఈ కొండ పైన ఒక్కడే ఉంటావే. చుట్టూ గుడ్లగూబలు, పాములూ ఉన్నాయే. మరి నీకే భయమూ లేదా?” అన్నాడు ఫుల్లయ్య. వెచ్చగా ఉన్న జావ మెల్లగా గొంతులోకి దిగుతుంటే భలే ఆనందంగా వుంది వాడికి. పొద్దుననగా ఇంత తిని ఇంట్లోనుంచి బయటకు పరుగెట్టి వచ్చినవాడు ఇప్పుడే తిండి మొహం చూస్తున్నది.

సన్యాసి మాట్లాడలేదు. వాడి మొహాన్నే చూస్తూ కూర్చొన్నాడు.

“చెప్పు. నీకు భయం లేదా?” అన్నాడు ఫుల్లయ్య.

“ఎందుకు లేదూ. నాకూ చాలా భయాలున్నాయి.” అన్నాడు అతను.

పుల్లయ్య మొహంలో నిరాశ కొట్టుకొచ్చినట్టు కనబడింది. ఈ సన్యాసి చాలా ధైర్యస్థుడని, అవ్వ చెప్పిన ఓ కథలోలా మహిమగల తాయెత్తో, ఉంగరమో ఇస్తే తీసుకెళ్ళాలని వాడు ఆశ పడ్డాడు పాపం.

"నిజంగా! నీకూ భయాలున్నాయా?" అని గుచ్చి అడిగాడు పుల్లయ్య.

"అవును. ఉన్నాయి. కానీ అవి నీకు అర్థం కాదు." అన్నాడు సన్యాసి పుల్లయ్య చేతిలోని ఖాళీ గిన్నెలోకి జావను నింపుతూ.

"ఒక్క భయం చెప్పు. అర్థం కాకపోతే మళ్ళీ అడగను." అన్నాడు వాడు. జావ మాంచి రుచిగా ఉంది. ఇంకా తాగాలని అనిపిస్తోంది కూడా.

"సంసారమంటే నాకు చాలా భయం." అన్నాడు సన్యాసి.

నిజంగానే అర్థం కాలేదు పుల్లయ్యకి. ఇచ్చిన మాట ప్రకారం మళ్ళీ అడగలేదు.

"అది సరే...నువ్వెందుకు కొండెక్కి వచ్చావు?" అన్నాడు సన్యాసి. మళ్ళీ జావను పోస్తూ.

ఆలోచనలో పడ్డాడు కుర్రవాడు. "ఏం చెప్పాలి? నిజం చెబితే ఏమౌతుంది? ఏమంటాడు? అబద్ధం చెబితే కనిపెట్టేస్తాడా?"

చివరకు నిజాన్ని చెప్పడానికే నిశ్చయించాడు.

"నాన్న పైన కోపంతో వచ్చేసా." అన్నాడు.

అప్పటిదాకా నిద్ర మత్తునూ, జావ రుచినీ అనుభవిస్తున్న పుల్లయ్య 'బుర్ర' బుస్ మంది. "అడుగు...ఈ ముసలి బుర్రని అడుగు. వీడు కూడా మీ నాన్ననే మెచ్చుకొంటాడు చూడు...చూడు." అంది.

అలవాటు కొద్దీ దాని మాటల్ని విన్నాడు పుల్లయ్య.

వాడి కేసి చూస్తూ – "అవునా! ఏమైంది?" అన్నాడు సన్యాసి.

ఒక గుక్క జావ తాగి "నాకు మా నాన్న పుల్లయ్య అన్న పేరు పెట్టాడు. నాకది ఇష్టం లేదు. మార్చమంటే తిట్టాడు. అదేదో ఆచారం అనేది ఉందంట. అది మా ముత్తాత కన్నా చాలా ముసలిదంట. అది చెప్పినట్టే మనం వినాలంట. అది

పేరు మార్చడానికి ఒప్పుకోదంట. కుదర్దన్నాడు. అందుకే వచ్చేసా." గబగబా చెప్పేసి పాత్రలో మిగిలివున్న జావను మొత్తం తాగేసి మూతి తుడుచుకొన్నాడు.

వాడి చేతిలోని గిన్నెను అందుకొని – "తప్పు కదా!" అన్నాడు సన్యాసి.

"ఒరేయ్! చూసావా! ఏం చెప్పాన్నీకు? ఈ ముసలి బుర్రలన్నీ ఒకేలా ఆలోచిస్తాయని చెప్పానా. చూడు...చూడరా...ఈ సన్నాసి బుర్ర కూడా నీ నాన్న బుర్రలాగే మనల్ని తీసిపారేస్తోంది." అంటూ అరిచింది పుల్లయ్య 'బుర్ర.'

"నిజమే"నని అనుకొన్నాడు పుల్లయ్య. మళ్ళీ వాడికి తన 'బుర్ర' మీద దృష్టి మరలింది. అంతే చాలుననుకొని "అడిగెయ్...నువ్వు చేసింది తప్పెలా అయ్యిందని అడిగెయ్...ఊ...ఊ..." అని పురమాయించింది బుర్ర.

"ఎందుకు? ఎలా తప్పు? మా నాన్నకి కాకర కాయంటే ఇష్టం లేదు. అందుకని అమ్మ ఆ కూరను వండదు. అది నాకిష్టమైనా కూడా అమ్మ వండదు. అక్కడా నాన్న ఇష్టమే నడుస్తుంది. నా పేరంటే నాకిష్టం లేదుగా మరి నా ఇష్టమెందుకు నడవదు. నాకిష్టం లేని పేరును ఎందుకుంచాలి?" ఆవేశపడుతూ అడిగాడు పుల్లయ్య.

సన్యాసి వేసిన పసరు మందు బాగా పనిచేసినట్టుంది. ఒంటి నొప్పులు బాగా తగ్గాయి. దాంతో మాటల్లో జోరు కూడా పెరిగింది. తన 'బుర్ర' చెప్పినట్టుగా ఈ సన్యాసిని కడిగెయ్యాలనే అనుకొన్నాడు. అలానే అడిగేసాడు కూడా. కానీ ఇప్పుడు సన్యాసికి కోపమొస్తుందేమోనన్న అనుమానం వచ్చేస్తోంది.

పుల్లయ్య కోపానికి సమాధానంగా నవ్వాడు సన్యాసి.

"నీ పేరుకు, కాకరకాయ కూరకూ సంబంధమా...హాహాహా...భలే చెప్పావు. అది సరేగానీ పుల్లయ్య అన్న పేరు పై నీకెందుకంత కోపం?" అని అడిగాడు సన్యాసి.

"చెప్పు...చెప్పు...గట్టిగా చెప్పు" అని ఎగదోసింది వాడి 'బుర్ర.'

"నాకు తెలుసులే...కాస్త ఆగు" అని లోపలే విసుక్కొంటూ "ఆ పేరులో ఉన్న గొప్పదనమేందో నువ్వు చెప్పు." అన్నాడు పుల్లయ్య.

బుస్ మంది 'బుర్ర.' "పేర్ల గురించి పాత బుర్రల్ని అడుగుతావేంట్రా శుంఠా? కడిగెయ్యకుండా!" అని కేకలేసింది. ఐనా పట్టించుకోలేదు పుల్లయ్య.

నాలుగైదుసార్లు బుస్ బుస్ మని అరిచి ఆపై ఆగిపోయింది 'బుర్ర.'

"పేరులో గొప్పదనం ఉండదు." అన్నాడు సన్యాసి.

ఆ సమాధానానికి 'బుర్ర' బుస్సుమని అనకముందే బుసగొట్టాడు ఫుల్లయ్య – "ఆ(... అందుకే అనేది. పెద్దోళ్ళందరూ ఒకటేనని. మా నాన్న కూడా ఇదే చెప్తాడు. నువ్వూ అదే చెప్తావు. మరి మా కుర్రవాళ్ళ మాట వినేదెవరు. ఏం మీరంతా మా మాటెందుకు వినకూడదు. అదే...అదే..." అని అవేశపడిపోసాగాడు ఫుల్లయ్య.

వాడి ఉద్ధృతిని చూసి వాడి 'బుర్రే' డంగైపోయింది.

"అరే...ఏం చెప్పావురా! భలే. చూడు ఆ ముసలి సన్నాసి మొహం చూడు ఏట్లా ఐపోయింది. కడిగెయ్. ఇంకో నాలుగు తిట్లు తిట్టేయ్. ఊ....పదా..." అని వాణ్ణి ఉత్సాహపరచింది.

రెచ్చిపోసాగాడు ఫుల్లయ్య – "ఏం మీకు మాత్రమే బుర్రలుంటాయా? మాకుండవా?"

"ఆహా...భలే..." అని మెచ్చుకొంది ఫుల్లయ్య 'బుర్ర.'

నవ్వాడు సన్యాసి. ఫుల్లయ్య కేకలు పెట్టినంతసేపూ నవ్వుతూనే ఉన్నాడు.

"ఊ...చెప్పు...ఫుల్లయ్య పేరులో గొప్పదనమేముంది?" అని హుంకరించి ఆగాడు ఫుల్లయ్య.

"చెప్పానుగా! గొప్పదనం పేరులో ఉండదు. ఆ గొప్పదనం మనిషిలో ఉండాలి."

నోరు తెరవబోయిన ఫుల్లయ్య ఆగిపోయాడు. ఎందుకంటే సన్యాసి ఆలోపే మళ్ళీ మాట్లాడ్డం మొదలు పెట్టాడు.

"నీ పేరు ఫుల్లయ్య గానే ఉండనీ. నువ్వు గొప్ప పనులు చేసి మీ అమ్మా నాన్నకి గుర్తింపు తెస్తే అది నీ గొప్పదనమౌతుంది. ఆ గొప్పదనం ముందు నీ పేరు గొప్పదనమెంత?" అని నింపాదిగా అన్నాడు సన్యాసి.

నోరు పెగల్లేదు ఫుల్లయ్యకి.

వాడికి లోలోపలే ఉక్రోషం పొడుచుకొస్తోంది కానీ అనుభవలేమి వాడి నోటిని కట్టేస్తోంది.

“పేరెందుకూ పనికి రాకపోతే పెట్టుకోవడమెందుకు? అని అడగరా. ఈ ముసలి బుర్ర ఏం చెప్తుందో చూద్దాం!” అంటూ ఉప్పందించింది పుల్లయ్య ’బుర్ర.’

అదే అడిగాడు వాడు. “అంత పనికిమాలిందైతే పేరెందుకు పెట్టుకోవడం?”

నవ్వాడు సన్యాసి.

పుల్లయ్యకి ఆ నవ్వును చూస్తుంటే ఒళ్ళు మండుకొస్తోంది.

వాడి ముఖ కవళికల్లో వాడి భావాలు తెలిసిపోతున్నా అవేవీ పట్టనట్టుగా మాట్లాడాడు సన్యాసి.

“చూడు! నీ పేరు పుల్లయ్య. నీ మిత్రుడి పేరు వెంకప్ప అనుకో. ఇంకో మిత్రుడు పేరు తిమ్మప్ప అనుకో. పేర్లన్నవి ఒకరినొకరు గుర్తు పట్టాడానికి, గుర్తు పెట్టుకోవడానికి మాత్రమే పనికొస్తాయి.”

“అబద్ధం! ఒట్టిసే గుర్తుపెట్టుకోవడానికైతే ఇన్ని పేర్లెందుకు? అందరూ ఒకే పేరే పెట్టుకోవచ్చుగా.” అని మొండిగా అన్నాడు పుల్లయ్య.

“ఒరేయ్! ఏ ఆవునైనా ఆవే అంటారుగా. పుల్లావు, తిమ్మావు అని పిలుస్తారా! ఇలా అడుగు. ముసలి వెధవ ఏం చెప్తాడో చూద్దాం.” అని లోనుండి బుసగొట్టింది ’బుర్ర.’

పుల్లయ్యకు చాలా అద్భుతంగా అనిపించిందీ తర్కం. నోరు తెరవబోతున్న సన్యాసిని క్రూరంగా చూస్తూ “ఇది చెప్పు. ఆవులకు, పక్షులకు పేర్లున్నాయా? అవెట్లా ఒకదాన్నొకటి గుర్తుపెట్టుకొంటాయ్. మా ఇంట్లో నాలుగావులున్నాయ్. దేని దూడ దాని దగ్గరకే పోవాలి. లేదంటే కుమ్మేస్తాయి. అవి తమ పిల్లల్ని పేర్లు పెట్టి పిలవ్వే. అంబా అని మాత్రమే పిలుస్తాయే. మన పేర్లకి గొప్పదనం లేకపోతే మనం కూడా అంబా అంబా అని అరుస్తూ తిరగొచ్చుగా!” దబదబా అరిచాడు పుల్లయ్య.

మౌనం వహించాడు సన్యాసి. అతని పెదవులపై అప్పటిదాకా ఉన్న నవ్వు ఇప్పుడు లేదు.

అది చూసిన పుల్లయ్య ’బుర్ర’ విజయగర్వంతో అనేకమార్లు బుస కొట్టింది. దాని ప్రతి బుసతోనూ పుల్లయ్య మనసులో విషయానికి బదులు విషం నిండుకోసాగింది. జవాబునివ్వకుండా ఊరకే కూర్చున్న సన్యాసిని చూస్తూ వెర్రి ఆనందంతో నవ్వసాగాడు.

ఆ నవ్వు పాము బుసలాగే వస్తోంది.

కాసేపటి నిశ్శబ్దం తర్వాత....

"నీ బుర్ర బాగా చెడిపోయింది అబ్బాయీ..." అన్నాడు సన్యాసి.

మొదట పుల్లయ్య ఉలిక్కిపడ్డాడు. ఆ తర్వాత వాడి 'బుర్ర' తుళ్ళిపడింది.

తను చెడినదాన్నని సన్యాసి తిట్టినట్టుగా గ్రహించిన పుల్లయ్య 'బుర్ర' కోపంలో గింగిర్లు తిరిగింది. ఎర్రటి ఎండలో కాలిన నేల మీద రాలిపడ్డ చీమలా కొంకర్లు పోయింది.

"రేయ్...విన్నావురా! ఆ ముసలి బుర్ర నిన్ను, నన్నూ ఏమందో విన్నావా? ఆయ్...." అంటూ విపరీతమైన విద్వేష విషాన్ని కక్కింది.

కానీ పుల్లయ్య తొందరపడలేదు. "నువ్వేడిపోయావ్. అందుకనే నన్ను, నా బుర్రనూ తిడ్తున్నావ్!"

"ఆహ్! రేయ్! నాకేడుపొస్తోంది. నాపై నీకెంత మమకారంరా!" అని వొంకర్లు పోయింది వాడి 'బుర్ర.' కానీ పుల్లయ్య చూపంతా సన్యాసి మొహం మీదనే ఉంది.

ఒకసారి తలవిదిలించి – "నీకు కథలంటే ఇష్టమేనా?" అన్నాడు సన్యాసి.

ఒక్కపెట్టున నవ్వడం మొదలెట్టాడు పుల్లయ్య.

"హాహాహ్...హాహ్..హాహ్...నువ్వేడిపోయవ్. అందుకనే కథలు చెప్పి తప్పించుకోవాలనుకొంటున్నావ్. హాహాహా"

వాడి నవ్వు చూసి సన్యాసి ముఖం పైన నవ్వులు వెలిసాయి.

పుల్లయ్య గంభీరంగా మారాడు. సన్యాసి మొహంలోని నవ్వు అతనికి హేళనతో కూడిన నవ్వుగా అనిపించింది.

"సరే, కథ చెబుతాను. విను..." అంటూ మొదలుపెట్టాడు సన్యాసి.

- - - -

# ఒక పేరు కథ

"పూర్వం చిత్రాంగదుడనే ఒక రాజు ఉండేవాడు. అతనొకసారి తన రాజ్యంలో ఉండే ఒక దట్టమైన మహారణ్యంలో వేటకు వెళ్ళాడు. ఆ అడవిలోకి మనుషులే కాకుండా దేవతలు కూడా వచ్చేవారు. ఈ రాజు వెళ్లిన వేళకి ఒక గంధర్వరాజు కూడా వేటకు వచ్చాడు. ఇద్దరూ ఒకరికొకరు ఎదురు పడ్డారు. అప్పుడు



చిత్రాంగదుడు "నీపేరేమని?" ఆ గంధర్వుణ్ణి అడిగాడు. వాడు 'చిత్రాంగదుడు' అని చెప్పాడు. దాంతో మొదటి చిత్రాంగదుడికి చిర్రెత్తుకొచ్చింది.

"నా పేరుతో నువ్వు చెలామణీ కావడానికి వీల్లేదు. వెంటనే పేరు మార్చుకో!" అని హుంకరించాడు.

ఆ మాటలకు గట్టిగా నవ్విన గంధర్వుడు – "మానవా! నేను గంధర్వుణ్ణి. నీకంటే వయసులోను, జ్ఞానంలోనూ, బలంలోనూ పెద్దవాణ్ణి. నువ్వో చిన్న పిల్లవాడివి. కనుక నా పేరే నువ్వు పెట్టుకొన్నావని నేను అనుకోవాలి. న్యాయంగా నువ్వే పేరు మార్చుకోవాలి!" అని హాస్యోక్తిగా మాట్లాడాడు.

ఆ గంధర్వుడి చతురతను గుర్తించలేని చిత్రాంగదుడు – "ఓరీ గంధర్వా! ఇది నా రాజ్యం. ఈ అడవి నాకు చెందింది. ఇక్కడ నా ఆజ్ఞలే చెల్లుబాటు అవుతాయి. నువ్వు అతిథివి మాత్రమే. కనుక నేను చెప్పినట్టుగా నువ్వు వినాలి. మర్యాదగా చెబుతున్నాను పేరు మార్చుకో." అన్నాడు.

"మానవా! నన్ను అతిథిగా భావించిన నీకు అతిథి దేవోభవ అన్న సూక్తి గుర్తురావడం లేదా? నన్ను గౌరవించడం పోయి అవమానిస్తున్నావే. ఇది సరైన పని కాదు. నీలాంటి రాజుకు శోభనిచ్చే వ్యవహారం కాదు. కనుక మనం ఎవరి దారిన వారు పోదాం." అని హితవు చెప్పాడు గంధర్వ చిత్రాంగదుడు.

యువకుడు, ఆవేశపరుడైన మానవ చిత్రాంగదుడు సర్రున కత్తి దూసి గంధర్వుణ్ణి గాయ పరిచాడు.

కోపగించిన గంధర్వ రాజు కత్తి తీసాడు.

వీరుడైన మానవ రాజు కూడా కత్తిని దూసి కలయబడ్డాడు.

రెండు కత్తులూ కలిసి ఖణేల్మన్నాయి. గొప్ప కత్తియుద్ధం జరిగింది. వారి విసుర్లకు కత్తులు ముక్కలైపోయాయి.

గదలు తీసుకొని గదాయుద్ధం చేసారు. గదలు విరిగాయే గానీ ఫలితం తేలలేదు.

ఈటెలు తీసుకొని విసురుకొన్నారు. అవి గురి తప్పాయి.

ఇక లాభం లేదని తమ కిరీటాల్ని, కవచాల్నీ, ఆభరణాల్ని, ఖరీదైన దుస్తుల్ని తీసివేసి లంగోటీల మీద మల్లయుద్ధానికై కలబడ్డారు.

పోరు ఘోరంగా సాగింది.

ఆ పోరులో బలవంతుడైన గంధర్వుడు మానవుడి మెడను విరిచేసాడు.

ఆవిధంగా మానవ చిత్రాంగదుడు చనిపోయాడు. అతని భార్య, ఆ రాజ్యం, ప్రజలూ దిక్కులేనివారైపోయారు.

చనిపోయేనాటికి ఆ మానవుడి వయసు ఇరవై సంవత్సరాలు మాత్రమే!

తను చేసిన ఘోరకృత్యానికి ఎంతో కుమిలిపోయాడు గంధర్వుడు. కేవలం ఒకే పేరు ఉన్నందువల్ల పంతానికి పోయిన ఆ కుర్రవాడిని చూసి కన్నీరు పెట్టుకొన్నాడు. తన మంత్రశక్తితో వాణ్ణి బ్రతికించాలని భావించాడు. కానీ దైవనిర్ణయాన్ని మీరలేకపోయాడు. గంధర్వుడు ఎంత ప్రయత్నించినా మానవుణ్ణి బ్రతికించలేకపోయాడు.

దుఃఖం, విరక్తి నిండిపోయిన హృదయంతో తన లోకానికి వెళ్లిపోయాడు.

“ఈ కథపై నీ అభిప్రాయం చెప్పు!” అన్నాడు సన్యాసి.

ఆసాంతం కథను శ్రద్ధగా విన్న పుల్లయ్యకు వెంటనే ఏం చెప్పాలో తోచలేదు. మానవ చిత్రాంగదుడు తొందరపడినట్టుగా అనిపించింది. అలా చెబితే సన్యాసి నెగ్గుతాడు. గంధర్వరాజు పొరబాటు చేసినట్టుగా అనిపించడంలేదు. ఎందుకంటే పాపం ఆయన మంచి మాటలు చెప్పి గొడవ పడకుండా వెళ్ళిపోదామని అన్నాడు. అంతేకాదు, చనిపోయిన

చిత్రాంగదుణ్ణి బ్రతికించేందుకు కూడా ప్రయత్నం చేసాడు. కనుక గంధర్వుడు చెడ్డవాడు కాడు. ఉత్తినే గొడవపెట్టుకొని ప్రాణాలు పోగొట్టుకొన్న మనిషిదే తప్పు.

“తప్పుని ఒప్పుకోవాలంటే చాలా ధైర్యం కావాలి.” అన్నాడు సన్యాసి.

చప్పున తలెత్తి చూసాడు పుల్లయ్య.

“అవును! చాలా చాలా ధైర్యం కావలి.” అని లోపలే అనుకొన్నాడు పుల్లయ్య.

“నీ మొహం మండినట్టే ఉంది. యుద్ధం చేసాడే అనుకో...మానవుడి మెడను విరిచెయ్యాలా ఆ గంధర్వుడు? బలంలో నీకంటే గొప్పవాణ్ణని చెప్పుకొన్నాడే. బలహీనుల్ని చంపడం గొప్పనా? వయసులో పెద్దోణ్ణని కూడా కూసాడే. నీకంటే పెద్దోడైన మీ నాన్నకు కోపమొచ్చిందనుకో నీ మెడను విరిచేసి చంపేస్తాడా? చిన్నపిల్లల్ని చంపడమేనా ముసలి బుర్రల గొప్పదనం?” అని గుసగుసలాడింది పుల్లయ్య ’బుర్ర.’

పుల్లయ్య మొహం వికసించింది. వాడి పెదాలపై కసితో కూడిన నవ్వొకటి పాములా జరజరా పాకింది.

వంకర్లు పోతున్న కనుబొమల్తో కళ్ళెగరేస్తూ అవే ప్రశ్నల్ని సంధించాడు వాడు.

ఆ ప్రశ్నలకు ఏమాత్రం తొట్రుపడని సన్యాసి – “ఈ ప్రశ్నల్ని వెయ్యకపోతే నువ్వు కుర్రోడివి కాలేవు. నీ బుర్ర బాగా చెడిపోయిందని అనుకోవడానికీ లేదు.” అన్నాడు.

కుతకుతా ఉడికిపోయాడు పుల్లయ్య.

ఇంకేమీ చెప్పకుండా లేచి జావ మూకుడు ఉంచిన మూలకు వెళ్ళాడు సన్యాసి. ఒక లోటాలో ఏదో మందుని తీసుకొచ్చి – “ఇది తాగు. ఇదే చివరి మందు. దీంతో నీ దెబ్బలు పొద్దున కల్లా మానిపోవాలి.” అని ఇచ్చాడు.

తీసుకోవడానికి సందేహించాడు పుల్లయ్య.

“నేను గంధర్వుణ్ణి కాను...నిన్ను చంపను. తీసుకో.” అని లోటాను ముందుకు చాచాడు.

మరో మాట లేకుండా మందును తాగేసి “నువ్వింకా జవాబు చెప్పలేదు. గంధర్వుడే తప్పు చేసాడు.” అని బెట్టుగా అన్నాడు పుల్లయ్య.

"నిజమే! కుర్రవాడి మెడను విరిచి చంపడం ఘోరమైనదే. కానీ అసలు గొడవకి మూలమెవరు? మానవుడా, గంధర్వుడా?"

"మానవుడే!"

"తప్పెవరిదో అక్కడే తీర్మానమైపోయింది. గంధర్వుడు ఆ మానవుణ్ణి కొట్టలేదు, తిట్టలేదు, ఏమీ చెయ్యలేదు. కేవలం పేర్లు ఒక్కటే ఐనాయని మూర్ఖత్వానికి పోయిన మొదటి చిత్రాంగదుడే తప్పు చేసాడు. పేరు కోసం ప్రాణాలు పోగొట్టుకొన్నాడు." అని చాలా నెమ్మదిగా, శాంతంగా పలికాడు సన్యాసి.

సన్యాసి చివరి పలుకులు విని ఉలిక్కిపడ్డాడు పుల్లయ్య. అవి తన గురించే చెప్పినట్టుగా వాడికి అర్థమైపోయింది. వాడు కూడా ఆ మధ్యాహ్నం దాదాపూ ప్రాణాలు పోగొట్టుకోబోయాడు. ఎందుకు? పేరు నచ్చలేదన్న కోపంతోనే కదా!

ఎదురు పలకడానికి వాడికి ధైర్యం చాల్లేదు. బుద్ధి సహకరించలేదు. ఎప్పుడూ బుసలు కొట్టే 'బుర్ర' కూడా మౌనం పూనింది.

వాడే కాదు ఆ గుడిసెలోని ప్రతి అణువూ చాలాసేపు మౌనం వహించాయి.

ఆ మౌనంలోనే సన్యాసి గుడిసె మధ్యలో జింక చర్మం వేసుకొని, పద్మాసనంలో కూర్చొని ధ్యానం చేసుకోసాగాడు. మూసిన కళ్ళని చాలాసేపు తెరవలేదు.

\- - - -

# సంచిలో బంగారం



రాత్రి ఎంతసేపు గడిచిందో పుల్లయ్యకు అర్థం కాలేదు. మధ్యాహ్నం ఔషధం తాగి బాగా నిద్రపోయినందువల్ల కళ్ళు మూతబడ్డం లేదు. దానికి తోడు సన్యాసితో జరిగిన వాగ్వివాదం వాడిలోని నిద్రను పూర్తిగా తరిమేసింది.

కొద్దిసేపు ఊరకే కూర్చొన్నవాడికి ఆపై కూర్చో బుద్ధి కాలేదు. నెమ్మదిగా లేచి, అలికిడి కాకుండా అటు ఇటు తిరగసాగాడు.

ఆ గుడిసెలో పుస్తకాల్లేవు. రెండు చెక్క భోషాణాలున్నాయి కానీ వాటి మూతలు బరువుగా ఉండడంతో ఎత్తడానికి పుల్లయ్య చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వాడి చేతులకి దెబ్బలు తగిలినందువల్ల బరువును మోయలేకపోయాయి.

ఉన్నట్టుండి వాడి కళ్ళని ఈశాన్య మూలం ఆకర్షించింది. అక్కడ మనిషి పోయేందుకు వీలుగా ఒకవైపు కొద్దిగా జాగాను వుంచి మిగతా మూడువైపులా తడికెలు వేసివున్నాయి.

పుల్లయ్యలో కుతూహలం పెరిగింది.

సన్యాసి వైపుకు చూసాడు. అతనిలో ఎలాంటి చలనమూ లేదు. ఊపిరి మాత్రం లయబద్ధంగా ఆడుతోంది. అదొక్కటే ఆ గుడిసెలో వినబడుతున్న ఒకే ఒక్క చప్పుడు.

అడుగులో అడుగు వేసుకొంటూ తడికెల్ని దాటుకొని లోపలికెళ్ళాడు.

అక్కడంతా ఏవేవో సరంజామాలున్నాయి. ఆ గది మధ్యలో ఒక చెక్క బల్ల, దాని మీద కొన్ని గాజు నాళాలు, పాత్రలూ ఉన్నాయి. వాటి నిండా రంగు రంగుల పదార్థాలు. నేల మీద కొన్ని గుడ్డ సంచులున్నాయి. అవి కట్టివేయబడక వదులు చేసివున్నాయి.

పుల్లయ్య చప్పుడు కాకుండా నెమ్మదిగా వంగి ఒక మూటను తీసి చూసాడు. అందులో ఇనుము ఉంది. మరో మూటను చూసాడు. అందులో రాగి ఉంది. ఇలా అన్ని మూటల్నీ తీసి చూసాడు. ఒక్కోదాంట్లో ఒక్కో లోహముంది.

అక్కడున్న మూటలన్నీ చూడ్డం ఐపోవడంతో నిటారుగా నిలబడి తలపైకెత్తి చూసాడు. ఆశ్చర్యంగా పైన ఒక తోలుసంచీ వేళ్ళాడుతోంది. ఇన్ని మూటలు నేల మీదవుండగా ఆ ఒక్క సంచీ అలా పైన వేళ్ళాడ్డమెందుకని ఆలోచించాడు. అందులో ఇంకేదో విచిత్రముండొచ్చని అనుకొంటూ మునివేళ్ళ మీద నిలబడి చేత్తో పట్టుకొన్నాడు.

ఆ మూటలో ఏదో గట్టి పదార్థం తగిలింది. పుల్లయ్య బరువు వల్ల ఆ సంచీ కిందకు లాగబడ్తూ చిన్నగా చప్పుడు చేయసాగింది. చప్పున వదిలేసాడు.

సన్యాసి ధ్యానం చెడగొట్టడం వాడికి ఇష్టం లేదు. అంతేగాదు, అతన్ని మేలుకొల్పి తను దొంగలా దొరికిపోవడమూ ఇష్టం లేదు.

ఇప్పుడు వాడికి ఆ తోలు సంచీలో ఏముందో చూడాలన్న ఉత్సుకత పెరిగిపోయింది.

ఏదైనా ఎత్తైన వస్తువు కనబడుతుందేమోనని చుట్టూ వెదికాడు. ఒక మూల చిన్న చెక్క పీట కనబడింది. చకచకా వెళ్లి దాన్ని తీసుకొచ్చి వేసుకొన్నాడు. దాని మీదకెక్కి జాగ్రత్త మునివేళ్ళపై లేచి తోలుసంచీ మూతికి కట్టివున్న దారాన్ని నెమ్మదిగా విప్పదీయసాగాడు.

సంచీ జారి వాడి గుండెల్ని భారంగా, బలంగా తాకింది. నొప్పి కలగడంతో "స్ స్ స్" అంటూ చప్పుడు చేసాడు పుల్లయ్య. వెంటనే తమాయించుకొని పీట నుండి మెల్లిగా దిగి, ఆత్రుతగా సంచీని విప్పదీసాడు.

ఆశ్చర్యం.

లోపల జిగేల్మంటూ మెరుస్తున్నదో లోహం.

"బం...గా...రం" అని పైకే అనేసాడు పుల్లయ్య.

ఇంట్లో నాన్న తట్టలో అమ్మ వేసే రాగి ముద్దంత పెద్దగా ఉంది ఆ బంగారు ముద్ద.

"ఈ సన్యాసి బంగారం చేస్తాడా?"

వెంటనే పక్కింటి అవ్వ ఒకరాత్రి చెప్పిన బంగారు మాంత్రికుడి కథ గుర్తుకొచ్చింది. అందులో స్వర్ణవిద్య కోసం ఒక మాంత్రికుడు తన లాంటి మంచి అబ్బాయిని బలియిచ్చేస్తాడు. కానీ ఈ సన్యాసికి బంగారం చెయ్యడం వచ్చేసింది గదా!

ఐతే వీడు బంగారాన్ని వజ్రం చేసే విద్య కోసం ప్రయత్నిస్తుంటేనో? ఆ విద్య సిద్ధించడం కోసం నరబలి ఇవ్వాల్సి వస్తేనో? దాని కోసం తనని బలి ఇవ్వడం కోసం తీసుకొనివచ్చి ఉండొచ్చు కదా!

అవ్వ చెప్పే కథల్లోని ప్రతి మాంత్రికుడూ తన బలిపశువును బాగా చూసుకొనేవాడే. వాళ్ల ఒంటి మీద దెబ్బలేమైనా వుంటే అవి మానేదాకా చక్కగా చూసుకొని, ఉన్నపళాన ఒకానొకరోజున నరికేసేవాడే. లేకపోతే వీడు కూడా తననెందుకు అంత బాగా చూసుకొంటాడు?

పుల్లయ్యకి జంకు పట్టుకొంది.

తోలు సంచీని యథాస్థానంలో కట్టేసి, పీటను ఎక్కడ్నుంచి తీసాడు అక్కడే పెట్టేసి, తడికెల్ని దాటుకొని గుడిసె వాకిలి దాకా పిల్లిలా శబ్దం రాకుండా నడిచి వెళ్ళాడు.

వెళ్తూ వెళ్తూ సన్యాసి వైపుకు చూసాడు. ఊపిరిని పీలుస్తూ, విడుస్తూ అతడింకా సమాధిస్థితిలోనే ఉన్నాడు.

పుల్లయ్య వాకిలి మీద చేయి వేసి మెల్లిగా లాగాడు. ఎంత మెల్లిగా లాగినా అది "కిర్ ర్ ర్" మంటూ చప్పుడు చెయ్యనే చేసింది.

సన్యాసి కదిలి, తల తిప్పాడు.

పుల్లయ్యకు ప్రాణాలు పోయినట్టుగా అయింది.

అతను నెమ్మదిగా కళ్ళు తెరచి – "పుల్లయ్యా! ఇప్పుడు బైటకు వెళ్లావంటే అన్యాయంగా చనిపోతావ్. ఈ కొండ మీద పులి ఉంది. నాలుగైదు కొండ చిలువలు ఉన్నాయి. లెక్కలేనన్ని త్రాచుపాములున్నాయి." అని మళ్ళీ కళ్ళు మూసుకొన్నాడు.

పుల్లయ్యకు అడుగు ముందుకు పడలేదు. అలాగని వెళ్ళి కూర్చోవాలనీ అనిపించడం లేదు.

"బల్ల మీద కూర్చో. మరో పది నిముషాల్లో నా జపం ముగుస్తుంది. నీకు నిద్దరొచ్చే వరకూ మాట్లాడుకొందాం." అని అన్నాడు సన్యాసి కళ్ళు తెరవకుండానే.

దూరంగా ఎక్కడో గూబ అరిచింది. చాలా వికృతంగా అరిచింది.

పుల్లయ్యకా అరుపు అపశకునంగా తోచింది. బైటికెళ్లడం కంటే లోపల కూర్చోవడమే మేలనిపించింది. వెళ్ళి బుద్ధిగా బల్ల మీద కూర్చొన్నాడు.

చెప్పినట్టుగానే పది నిముషాల్లో ఆసనం నుండి లేచి, సాష్టాంగం పడి ఒక నిముషం అలానే ఉండి మోకాళ్ళపై లేచి, తలనెత్తి ఆకాశం వైపుకు చూస్తూ ఏదో గొణిగి గొణిగి పైకి లేచాడు సన్యాసి.

నూనె దీపం వెలుగులో సన్యాసి ముఖాన్ని అదేపనిగా పరీక్షించి చూసాడు పుల్లయ్య.

అవ్వ చెప్పినట్టుగా చింతనిప్పుల్లాంటి కళ్ళూ, గుబురైన కనుబొమ్మలూ, చింపిరి జుట్టూ ఏవీ కనబడలేదు. బదులుగా వెలుగుతున్న కళ్ళు, చక్కటి నవ్వూ అగుపించాయి. కాసింత సమాధాన పడ్డాడు పుల్లయ్య.

వాడు కూర్చొన్న బల్ల కెదురుగా గుండ్రంగా చుట్టివుంచిన ఒక బొంతను ఆనుకొని నడుం వాల్చాడు సన్యాసి.

ఏమైనా మాట్లాడ్తాడేమోనని ఎదురుచూసాడు కానీ సన్యాసి నోరు విప్పలేదు.

పుల్లయ్య మనసు మళ్ళీ ఆ తడికెల గది వైపుకు మళ్ళింది.

సన్యాసితో కొట్లాడినంతసేపూ తనతోనే ఉన్న 'బుర్ర' తాను ఆ తడికెల గదిలోకి వెళ్ళినప్పటి నుండీ మాయమైనట్టు గుర్తించాడు. అంతేకాదు, ఈ సన్యాసి తనను బలిస్తాడేమోనని భయపడి చచ్చినప్పుడూ తనకు ధైర్యం చెప్పలేదు.

"ఎక్కడపోయింది చెప్మా?" అని అనుకోసాగాడు.

వాడి ఆలోచనల్ని చెరిపేస్తూ వినబడింది సన్యాసి గొంతు.

"నిద్ర రావడం లేదా?"

లేదన్నట్టు అడ్డంగా తలవూపాడు పుల్లయ్య.

"ఐతే, ఏదైనా కబుర్లు చెప్పు." అన్నాడు సన్యాసి.

"నువ్వే చెప్పు. నీ పేరేమి? ఊరేది? ఒంటరిగా ఈ కొండ మీద ఏం చేస్తున్నావ్?"

చివరి వాక్యాన్ని బాగా నొక్కి అడిగాడు ఫుల్లయ్య. ఈ సన్యాసి కొండమీద ఎందుకుంటున్నాడో వాడికి తెలిసిపోయింది గదా!

అందుకు ప్రతిగా "ముందు నీ గురించి చెప్పు. ఆ తర్వాత నా గురించి తప్పకుండా చెప్తాను." అన్నాడు సన్యాసి.

"నిజంగా చెప్తావా? ఒట్టు!" అని అడిగాడు ఫుల్లయ్య.

చెబుతానన్నట్టుగా తల వూపాడు సన్యాసి.

"మా నాన్న పేరు శరభయ్య. ఈ కొండ దిగితే తూర్పు వైపు వుంది మా వూరు. ఆ ఊళ్ళో మా జాతోళ్ళే ఎక్కువమంది ఉంటారు. వాళ్ళందరికీ మా నాన్నే పెద్ద. పెద్ద అంటే వయసులో కాదు. ఏ జగడమొచ్చిన నాన్న మాట ఆఖరుదన్న మాట, అందుకే ఆయన పెద్దోడని అంది."
"ఓహో! శరభయ్య గొప్పవాడన్న మాట!" అన్నాడు సన్యాసి.

ఫుల్లయ్యకి సన్యాసి మాటలోని శ్లేష అర్థం కాలేదు. బదులుగా గర్వంగా అనిపించింది. గొప్ప నాన్న ఉంటే అట్లా గర్వమొస్తుందేమో మరి.

ఉత్సాహంగా చెప్పుకుపోసాగాడు – "మా తాత కంటే ముత్తాత చానా గొప్పోడని చెప్తాడు మా నాన్న. ముత్తాత కంటే ఆయన నాన్న ఇంకా గొప్పోడని అందరూ చెప్తారు."

"ఎందుకు?" అడ్డు తగిలాడు సన్యాసి.

"మా పెద ముత్తాత కాలంలో పక్క ఊరి రాజు దండెత్తి వచ్చి మా ఊరిని, పొలాల్ని, తోటల్నీ తగలబెట్టేసాడంట. ఆరు నెలలు తినడానికేమీ లేకపోతే మా పెదముత్తాత ఊరికి దూరంగా పాతరలో దాచిన రాగి గింజల్ని తీసుకొచ్చి సంగటి ముద్దలు చేయించి పేసాడంట. అందుకనే ఆయన్ని ముద్దల దాసప్పా అని పిల్చేవారంట." అని సన్యాసి మెచ్చుకోలు కోసం ఆగాడు ఫుల్లయ్య.

అది అర్థమైన సన్యాసి "ఆహా...నిజంగా చాలా గొప్పోడు." అని అన్నాడు.

"ఆయన కొడుకే మా ముత్తాత. ఆయన పేరు ఫుల్లయ్య. అదే నా పేరు."

"ఓహో..." అని మాత్రమే అన్నాడు సన్యాసి.

"మా ముత్తాత కాలంలో కూడా కరువొచ్చిందంట. అప్పుడు ఆయన కూడా అదే పాతర నుంచి రాగులు తీసుకొచ్చి పంచాడంట. మా పెద ముత్తాతకి చానా కాలం పిల్లలేరంట. అంటే లేరని కాదు, పుట్టి పుట్టి చచ్చిపోయేవాళ్ళంట. మా పెద్ద ముత్తవ్వ కడుపుతో ఉన్నప్పుడు ఇల్లొదిలి వెళ్ళిపోయిన పెదముత్తాత కాన్పు వేళకొచ్చి 'కొడుకు పుడ్తాడు. వాడికి పుల్లయ్య అన్న పేరే పెట్టాలి. అప్పుడు బతుకుతాడు.' అని చెప్పాడంట. అందుకే మా ముత్తాతకి పుల్లయ్య పేరే పెట్టారు."

"ఓహో! మీ తాత ముత్తాలు చాలా గొప్పోళ్ళు." అన్నాడు సన్యాసి.

"అవును. అద్సరే, నీ పేరేమి?" – సన్యాసి ఇచ్చిన మాటను గుర్తు చేస్తున్నట్టుగా అడిగాడు పుల్లయ్య.

గట్టిగా ఊపిరి తీసుకొని – "నాకెవ్వరూ లేరు. నేను అనాథను." అని మాత్రమే అన్నాడు.

"అంటే నువ్వెక్కడ పుట్టావో నీకే తెలిదా!"

అది తెలుసునన్నట్టుగా సైగ చేసాడు సన్యాసి.

"మరి మీవాళ్ళ దగ్గర ఉండకుండా ఈ కొండ మీద ఎందుకుంటున్నావ్? ఎందుకు?" అని గుచ్చి అడిగాడు పుల్లయ్య.

వాడడిగిన రెండో ప్రశ్నకు సమాధానం వాడికే తెలుసు. ఎందుకంటే వాడు సన్యాసి చేసిన బంగారం చూసేసాడు గదా! కానీ సన్యాసి ఏం చెబుతాడో తెలుసుకోవాలని తహతహ.

దాంతో చర్చ మొదలైంది.

"చెప్పు...ఎన్నిరోజులైంది ఈ కొండ మీద వుంటూ?"

"ఈ కొండ మీదా....చాలా రోజులైపోయింది."

"అంటే ఎన్ని రోజులు?"

"ఏమో తెలీదు...ఎప్పుడూ లెక్క పెట్టలేదు. కానీ చాలా కాలమే ఐపోయివుంటుంది."

“ఆహా…మరి ఈ కొండ మీద ఏం చేస్తుంటావు?”

“చూసావుగా! ధ్యానం చేసుకొంటుంటాను.”

“నేన్నమ్మను.”

“సరే, నీ ఇష్టం.”

“నువ్వు అబద్ధం చెబుతున్నావ్…” అని ఆవేశంగా అన్నాడు పుల్లయ్య.

“ఈ ముసలి బుర్రలు అంతేరా…ఎప్పుడూ అబద్ధాలు చెబుతాయ్. మన కుర్రోళ్ళకి బుద్ధి చెప్పడానికొస్తాయ్…హా…” అని ఎక్కడినుంచి వచ్చేసిందో వచ్చేసింది పుల్లయ్య 'బుర్ర'.

దాని బుసకు ఉలిక్కిపడ్డాడు పుల్లయ్య. “ఇందాకట్నుంచీ ఎక్కడికెళ్ళావ్?” చిరాగ్గా అడిగాడు.

“ఉన్నా…నీతోనే ఉన్నాలే. వదలకు ఈ సన్నాసి బుర్రని.”

“అలాగేలే…” అంటూ “పెద్దవాడివి. సన్యాసివి. ధ్యానం చేసుకొనేవాడివి ఇలా అబద్ధం చెప్పొచ్చా?” – నిలవేసాడు పుల్లయ్య.

“అరే…ఎందుకంత కోపం?” అన్నాడు సన్యాసి నవ్వుతూ.

“నువ్వు ఒట్టు పెట్టావ్!” తప్పితే నరకానికి పోతావన్నట్టుగా ధ్వనించింది వాడి గొంతు.

“అరే…భలే….హా….బుస్” అంటూ ఆ బుర్ర కూడా జుగల్‌బందీ చేసింది.

నిట్టూర్చాడు సన్యాసి. “సరే, నీకంత పంతమైతే చెబుతాను విను.”

\- - - -

# సన్యాసి కథ



తన కథను మొదలుపెట్టాడు సన్యాసి.

"మా నాన్న ఓ జ్యోతిష్కుడు...."

"అంటే?" అడ్డు తగిలాడు పుల్లయ్య.

"అంటే...పెళ్ళిళ్లకీ, పూజలకీ ముహూర్తాలు పెట్టేవాడు."

"ఆహా....తెలిసింది."

"నేను పుట్టిగానే జాతకం వేసి అమ్మతో 'ఒసేవ్! వీడు ఉట్టి వెధవాయే అవుతాడు.' అని అన్నాట్ట!"

విరగబడి నవ్వాడు పుల్లయ్య. ఆ నవ్వులో "అయ్యావుగా!" అన్న అర్థం వికవికా ధ్వనించింది.

సన్యాసి ఏమీ పట్టించుకోకుండా చెప్పుకోపోసాగాడు.

"నేను పుట్టిన మొదటి సంవత్సరంలో వర్షాలు బాగా కురిసాయ్. దాదాపు నాలుగేళ్ళ తర్వాత పడ్డ వర్షాలవి. ఎంతగా పడ్డాయంటే చెరువు కట్ట తెగి ఊళ్ళోకి నీళ్ళొచ్చేసాయి. కట్ట కింద ఉన్న ఇళ్ళన్నీ మునిగిపోయాయి. ఎగువున ఉన్న ఇళ్ళల్లోకి మోకాళ్ళ దాకా పారాయి చెరువు నీళ్ళు. నేల మీద పడుకొన్న అమ్మ ఉయ్యాలని కింది దాకా లాగి తనకు అందేటట్టుగా కట్టింది కదా, నేను ఆ నీళ్ళలోకి మునిగిపోయాను."

"అమ్మోయ్" అన్నాడు పుల్లయ్య.

"అవును. అమ్మ నిద్రలేచి నన్ను పైకెత్తింది గానీ లేకుంటే నేను చచ్చిపోయేవాణ్ణి...అప్పుడే."

కళ్ళు పెద్దవి చేసి వింటున్నాడు పుల్లయ్య.

“అట్లా మొదటి గండం నుంచి బైటపడ్డాను. ఐదేళ్ళొచ్చాక నాన్ననే ఇంట్లో చదువు చెప్పేవాడు. నాకు లెక్కలు అస్సలు వచ్చేవి కావు.”

“నాలాగే…” అన్నాడు పుల్లయ్య. వాడికెందుకో సన్యాసి కథ వింటుంటే మంచి సంబరంగా ఉంది.

“మరి నాన్నలాగా నేనూ పెద్ద జ్యోతిష్కుణ్ణి కావాలంటే లెక్కలు బాగా రావాలి. ప్రతి తప్పు లెక్కకూ వీపు చిట్లిపోయేది. అమ్మ వచ్చి నన్ను ఎత్తుకుపోయేదాకా అలా వీపు మోత మోగుతూనే ఉండేది. ఇలా మూడేళ్ళు జరిగింది. ఒకరోజు అంటే నాకు ఎనిమిదేళ్ళొచ్చినప్పుడు తిరుపతి కొండకు తీసుకెళ్ళి వడుగు చేసారు.”

“వడుగంటే?” ప్రశ్నించాడు పుల్లయ్య.

తన భుజం నుండి వేళ్ళాడుతున్న యజ్ఞోపవీతాన్ని చూపించి “ఇదీ” అన్నాడు.

“ఓహో, ఇదా! మావూళ్ళోని శాస్తుర్లకీ ఉంది ఈ దారం.” అన్నాడు.

“ఇది దారం కాదు…సర్లే, విను. అలా అందరితో బాటూ కొండకెళ్ళాను. వడుగైపోయింది. అందరమూ దర్శనానికెళ్ళాము. ఒకటే జనం. ద్వారమేమో చిన్నది, జనాలేమో పుట్టలు పుట్టలు. వాకిళ్ళు తెరవగానే ఒకటే తొక్కులాట. అమ్మావాళ్ళొక వైపు నేనొక్కణ్ణీ ఒకవైపూ ఐపోయాము. పిల్లవాణ్ణి గదా, పొట్టిగా ఉండబట్టి వాళ్ళ వీళ్ళ కాళ్ళ సందుల్లో కొట్టుకుపోయాను.”

“అయ్యో…’

“అయ్యో అన్నవాళ్లెవ్వరూ లేరు. అందరికీ దేవుణ్ణి చూసేయాలన్న తాపత్రయం. నాకేమో అమ్మను చూడలన్న తాపత్రయం. దేవుడికి, అమ్మకి పోటీ. చివరకు దేవుడే గెలిచాడు. అమ్మ ఎక్కడికో వెళ్ళిపోయింది. నేను ఒక్కణ్ణే మిగిలిపోయాను.”

పుల్లయ్యకి వాడి అమ్మ గుర్తుకొచ్చింది. బిడ్డ కనబడక ఎంత తనకలాడిపోతూంటుందో ఈపాటికి!

“ఎవరో నా చెయ్యి పట్టుకొని జాగ్రత్తగా జనాల్ని దాటించారు. గుడి బైటకొచ్చాక తలెత్తి చూసాను. ఎవరో గుబురు గడ్డం ఆసామి. నొసటన ఇంత పెద్ద నామాలు. బక్కగా ఉన్నాడు. ఒంటి మీద ఒక పంచె, భుజం మీద ఒక తుండుగుడ్డా వేసుకొనివున్నాడు. నన్నెత్తుకొని వివరాలు అడిగాడు. నాకెంత తెలుసో అంత చెప్పాను. పాపం రెండు రోజులు అన్ని

సత్రాలూ తిరిగాడు. ఎక్కడా అమ్మ జాడ లేదు. నాన్నా కనబడలేదు. నాకు చాలా ఏడుపొచ్చింది. ఆ పెద్దాయన ధైర్యం చెప్పి తనతో బాటే తీసుకెళ్ళాడు."

పుల్లయ్యకి సన్యాసి మీద చాలా జాలేసింది. అమ్మా నాన్న ఉండి కూడా వాళ్ళతో లేకపోవడం ఎంత దారుణం.

"నేను బ్రాహ్మణ పిల్లవాడినని తెలిసిన పెద్దాయన ఆయన ఊరికెళ్తూ దారిలో కనబడిన రామానుజ కూటం ఒకదాంట్లో నన్నొదిలి పోయాడు. పదహారేళ్ళు వచ్చేదాక కూటంలో ఉంటూ చాలా శాస్త్రాలు చదువుకొన్నా."

"మరి జ్యోతీషం నేర్చుకొన్నావా?" ఉండలేక అడిగేసాడు పుల్లయ్య.

నవ్వాడు సన్యాసి – "లేదు. నాన్న కోరికను తీర్చాలనే అనుకొన్నా. కానీ నాకా విద్య రాలేదు."

"పాపం..."

"పాపమే. నాన్న పేరు నిలబెట్టకపోవడం పాపమే." నిట్టూర్పుతో కలిసి వచ్చాయా మాటలు.

పుల్లయ్యకి నాన్న గుర్తుకొచ్చాడు. ఊళ్ళో ఎంత పెద్ద పేరున్న మనిషో. కొండ దిగిపోగానే నాన్న పేరును నిలబెట్టెయ్యాలి.

"ఆ తర్వాతేమైంది?"

"ఒకరోజు, ఎవరో మ్లేంఛులంట ఊళ్లను కొల్లగొడ్తూ, జనాల్ని చంపుతూ మా ఊరికీ వచ్చారు."

"చంపడమెందుకు?"

"వాళ్ళ మతాన్ని ఒప్పుకోనివాళ్ళను చంపాలంట. అది వాళ్ళ పద్ధతి."

"ఘోరం..."

"అవును. మా ఊళ్ళో చాల ఘోరాలే జరిగాయి. కనిపించిన ప్రతివారినీ పొడిచి చంపేసారు. మా కూటంలోకి దూరి అక్కడున్న మమ్మలందరినీ ఒకచోట చేర్చారు. ఆ ముఠా నాయకుడొకడు వచ్చీరాని తెలుగులో మమ్మల్నందరినీ వాళ్ళ మతానికి మారమన్నాడు లేకపోతే చంపేస్తామన్నాడు."

"అప్పుడు...."

“ప్రాణాల మీద ఆశవున్న కొద్దిమంది ఒప్పుకొని బ్రతికిపోయారు. ఎదిరించినవాళ్ళు చంపబడ్డారు. ఏదీ చెప్పకుండా తలవంచుకొనివున్న నాలాంటివాళ్ళ చేతులు, కాళ్ళకి సంకెళ్ళు వేసి లాక్కెళ్ళారు. అలా వెళ్తుండగా మా దేశం రాజుగారు పెద్ద సైన్యంతో ఎదురుపడ్డారు. గొప్ప యుద్ధం జరిగింది. మమ్మల్ని బంధించినవాళ్ళందరూ చచ్చిపోయారు. మా సంకెళ్ళు తెగిపోయాయి. అందరూ వెళ్ళిపోయారు. నేను మళ్ళీ ఒక్కడినే మిగిలిపోయాను. అక్కడినుంచీ ఒకచోట కూడా కాలు నిలవలేదు. తిరిగి తిరిగి ఈ కొండకు వచ్చాను. అప్పట్నుంచీ ఇక్కడే ఉంటున్నాను.”

“మరి ఆ బంగారం? ఆ బంగారం ఎక్కడిది?” లోపల్నుండీ ఆగకుండా ఉరుకుతున్న అత్యుత్సాహం ఫుల్లయ్య చేత ఈ ప్రశ్నను వేయించింది.

నిర్ఘాంతపోయాడు సన్యాసి.

“నీకెలా తెలుసు?”

“నువ్వు జపం చేసుకొంటున్నప్పుడు చూసాను.” చెప్పాడు ఫుల్లయ్య.

మాట్లాడలేదు సన్యాసి.

తప్పు చేసినవాడిలా తల దించుకొన్నాడు ఫుల్లయ్య.

“ఇక పడుకో…” అన్నాడు సన్యాసి.

చేసేది ఏమీ లేక బల్ల మీద పడుకొన్నాడు ఫుల్లయ్య.

సన్యాసి మాత్రం శూన్యంలోకి చూస్తూ ఆ బొంతకు అలా జారిగిలబడే ఉండిపోయాడు.

\- - - -

# తెల్లవారడానికి ముందు...



ఎంతసేపలా గడిచిందో గానీ పుల్లయ్యకి మనసులో మనసు లేదు. ఇప్పటిదాకా తను ఎన్నిసార్లు ఈసడించుకొన్నా విసుక్కోని సన్యాసి బంగారం విషయంలో అంత కోపాన్ని చూపించడం వాడికి భయాన్ని పుట్టిస్తోంది.

పక్కకు తిరిగి పడుకొనే మిషతో సన్యాసి వైపుకు చూసాడు. అతను అక్కడే, అలానే, కళ్ళు తెరుచుకొనే జారిగిలబడివున్నాడు.

టక్కున లేచి, బల్ల దిగి, సన్యాసి కాళ్ళు పట్టుకొన్నాడు.

అనుకోని ఈ ఘటనకు ఉలిక్కిపడ్డ సన్యాసి – “లే లే” అని పుల్లయ్య భుజాల్ని పట్టుకొన్నాడు.

“నేను తప్పుచేసుంటే క్షమించు స్వామీ!” అన్నాడు.

నవ్వాడు సన్యాసి. ఆ నవ్వు చాలా స్వచ్ఛంగా ఉన్నట్టు తోచింది పుల్లయ్యకి.

అతని పక్కనే కూర్చొన్నాడు.

“నాకు బంగారం చేయడం తెలుసు.” అన్నాడు సన్యాసి ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండా.

పుల్లయ్యకి ఆశ్చర్యం వెయ్యలేదు. పక్కింటి అవ్వ చెప్పిన కథల వల్ల వాడికి చాలా విషయాలు ముందుగానే తెలిసిపోతున్నాయి గదా!

“నువ్వూ నేర్చుకొంటావా?”

ఏం చెప్పాలో తోచలేదు వాడికి. ఒక నిముషం తర్వాత “నేర్పితే నేర్చుకొంటాను స్వామీ!” అన్నాడు చాలా వినయంగా.

బంగారం చేయడం నేర్చేసుకొంటే ఎలావుంటుందని ఒక్క నిముషం ఊహించుకొన్నాడు –

ఊళ్ళో తన ఇంటిముందు పొడుగాటి వరసలో జనాలు. ఇత్తడి చెంబులు, రాగి బిందెలు, కంచు తప్పేళాలు…ఇంకా అలాంటివే ఎన్నో పాత్రలు పట్టుకొని నిలబడివున్నారు. ఇంట్లో తను హాం ఫట్ అంటున్నాడు. అనడమే ఆలస్యం ఎదురుగా ఉన్న వస్తువు బంగారంగా మారిపోతోంది. ఆ పాత్ర యజమాని సాగిలబడి కానుక చెల్లించుకొని పోతున్నాడు. ఇంతలో రాజుగారు వచ్చారని వార్త. తనే లేచి ఎదురువెళ్ళాడు. రాజుగారి వెంట వంద బళ్ళ నిండుగా సామాన్లు. దివాణంలోని ఒక్క గరిటె కూడా వదలకుండా తీసుకొచ్చారని మంత్రిగారు వినయంగా విన్నపం చేసుకొన్నారు. తను హాం ఫట్ అన్నాడు. రాజుగారి సంబరపడిపోయి ఒక బిందె, ఒక గరిటె, ఒక తట్టను కానుకగా సమర్పించుకొని వందబళ్ళనీ తోలుకుపోయారు. తన పక్కనే వున్న నాన్న మీసం దువ్వుకొంటూ 'మా కొండయ్యంటే ఏమనుకొన్నారు…ఆయ్" అని ఊరివాళ్ళతో అంటున్నాడు.

"ఫుల్లయ్యా! ఫుల్లయ్యా!" అని సన్యాసి కుదిపితే గానీ మెలకువ కాలేదు.

తన కలకు తానే సిగ్గుపడ్డాడు. "చెప్పు స్వామీ" అని అన్నాడు.

"బంగారం చేయడం చాలా కష్టం సుమా! కొండనెక్కడానికి ఎంత కష్టపడ్డావో దానికి పదింతలు పడాలి."

"ఓ పడ్తాను స్వామీ."

"అంత ధైర్యంగా ఎలా చెప్పగల్గుతున్నావ్?"

"నువ్వున్నావుగా స్వామీ!"

నవ్వాడు సన్యాసి. ఫుల్లయ్యను చూస్తూ "సరే. నువ్వు మొదటగా ముఖ్యమైనది, చాలా కష్టమైన పని ఒకటి చెయ్యాలి. అది చేసేసావంటే బంగారం విద్య నేర్చుకోవచ్చు!" అన్నాడు.

"చెప్పు స్వామీ, చేసేస్తా" అని ముచ్చటపడ్డాడు ఫుల్లయ్య. వాడికి బంగారం విద్య, దాని వల్ల వచ్చే పేరు తెగ ఊదరపెట్టేస్తున్నాయి. మాటలన్నీ అనాలోచితంగా వచ్చేస్తున్నాయి. ఆ పనేదో సన్యాసి చెప్పడమే తరువాయి చేసేయ్యాలని ఉవ్విళ్ళూరిపోతున్నాడు.

"ఆ(…ఏం లేదు….నువ్వు మీ అమ్మనీ నాన్ననీ మర్చిపోవాలి!" అన్నాడు.

మతిపోయింది ఫుల్లయ్యకి.

“ఎలా స్వామీ! బంగారం చెయ్యాలంటే వాళ్ళనెందుకు మర్చిపోవాలి?” చాలా అమాయకంగా అడిగాడు.

అప్పటిదాకా వాడిలో కొలువుదీరి రాజ్యం చేసిన వాడి ’బుర్ర’ పలాయనం చిత్తగించేసినట్టుంది. బాల్య సహజమైన భయం వాడిలో స్పష్టంగా కనబడుతోంది.

“పుల్లయ్యా! బంగారం చేసేవాడు బైరాగిలానే బ్రతకాలని బ్రహ్మయ్య శాపం. మరి వాళ్ళని వదిలెయ్యాలి. తప్పదు.” అన్నాడు సన్యాసి.

బిక్కమొహం వేసాడు పుల్లయ్య. “నీకంటే అమ్మా నాన్న చిన్నప్పుడే తప్పిపోయారు. మరి నాకేమో....” మిగతా మాటల్ని గుటకలు వేస్తూ మింగేసాడు.

“ఐతే ఒక్కమాటలో చెప్పు. వాళ్ళని వదిలివుండగలవా? లేదా!” అని నిష్టూరంగా అడిగాడు సన్యాసి, పుల్లయ్య కళ్ళలోకి సూటిగా చూస్తూ.

“లేదు స్వామి. నా చేత కాదు. నాకు అమ్మా నాన్నా కావాలి.” గొంతు పూడుకుపోతుంటే బేలగా పలికాడు పుల్లయ్య.

వాడి తలను నిమిరాడు సన్యాసి.

“అసలు బంగారం ఏమిటో తెలుసుకొన్నావు.” అని నవ్వాడు.

పూర్తిగా అర్థం కాకపోయినా పుల్లయ్యా నవ్వాడు.

ఆపై వాడు సుఖంగా నిద్రపోయాడు.

- - - -

# తెల్లవారింది...

ఎవ్వరూ లేపకుండానే మెలకువైంది పుల్లయ్యకు.

అప్పటికే సన్యాసి లేచి, జింక చర్మం మీద ధ్యానం చేసుకొంటున్నాడు.



పుల్లయ్య హుషారుగా తెరచివుంచిన గుడిసె వాకిలి నుండి బైటకెళ్ళాడు. అక్కడ ఓ పెద్ద కుంటలో నీళ్ళున్నాయి. చెంబుతో నీళ్ళు తీసుకొని మొహం కడుక్కొని వెంటనే స్నానం కూడా చేసేసాడు.

స్నానం చేసుకొంటున్నప్పుడు చూసుకొన్నాడు, దెబ్బలన్నీ మానిపోయాయి. కేవలం గుర్తులు మాత్రమే మిగిలున్నాయి. నొప్పులు కూడా మాయమైపోయాయి.

వాడికి ఉత్సాహం ఉప్పొంగి వస్తోంది. ఎంత త్వరగా కొండ దిగ గలిగితే అంత త్వరగా దిగెయ్యాలి. అమ్మనీ, నాన్ననీ చూసెయ్యాలి. ఊహల్లో తడుస్తూ స్నానం చేసాడు.

ముందు రోజు సన్యాసి ఇచ్చిన తుండుగుడ్డతో ఒళ్ళు తుడుచుకొని, అతనే ఇచ్చిన ఓ కొత్త పంచెను చుట్టుకొని గుడిసెలోకి వచ్చాడు.

సన్యాసి ధ్యానం ముగించేసివున్నాడు. పుల్లయ్య లోనికి రాగానే నవ్వుతూ దగ్గరకొచ్చాడు. వాడు అతని కాళ్ళకి దండం పెట్టాడు.

"పుల్లయ్యా! నీ పేరుకు అర్థం తెలుసుకోవాలనివుందా?" అన్నాడు సన్యాసి.

అయోమయం, సిగ్గు కలగలసిన మొహంతో అతని వైపుకు చూసాడు పుల్లయ్య. సన్యాసి కావాలని తనను ఎద్దేవా చేస్తున్నాడేమోనని పరీక్షించి చూసాడు.

లేదు. అలాంటి ఛాయలేవీ అతని కన్నుల్లోగానీ, మాటల్లోగానీ కనబడలేదు.

"చెప్పు స్వామీ! వింటాను." అన్నాడు.

"విను! పుల్ల అంటే పువ్వు అని అర్థం. పువ్వు ఉంటేనే కదా కాయ కాచేది? ఊళ్ళో కరువొచ్చినప్పుడు, దండయాత్ర జరిగినప్పుడు మీ తాతలు పువ్వులు, కాయలు విరగ కాచిన చెట్లలా నిలిచారు. ఆకలేసినవాళ్ళకి అన్నం పెట్టారు. అందుకే మీ నాన్నకి ఆ పేరంటే అంత ఇష్టం. ఆ పేరే నీకూ పెట్టాడు. ఇప్పుడు చెప్పు! మీ నాన్నకి బుర్ర లేదా?"

నవ్వుతూ నిండిన సన్యాసి ముఖంలో వెకిలిదనం లేదు సరిగదా ఆప్యాయత మెండుగా కనబడింది ఆ కుర్రవాడికి. అసలే పసివాడు బుద్ధిలేని బుర్ర సహవాసంతో, హద్దులెరుగని కుర్రకారుదనంతో తుళ్ళిపడ్డాడు గానీ నిజానికి పుల్లయ్య చాలా మంచివాడు. ఇప్పుడా మంచిదనానికి పచ్చదనం విచ్చింది.

మంచితనానికి చిరునామా కన్నీళ్ళేగా!

అవి ఇప్పుడు వాడి కంటినిండా నిండువున్నాయి.

"తప్పైపోయింది స్వామీ. ఇంకెప్పుడూ నాన్నతో నా పేరు గురించి కొట్లాడను. ఇల్లొదిలి పెట్టి పారిపోను." అన్నాడు. వాడి గొంతులో ఓ ధృడత్వం ఉంది. వాడి గొంతు వాడికే కొత్తగా వినబడుతోంది.

"భేష్! నిజమైన బంగారువంటే నువ్వే. వెళ్ళు. వెళ్ళి మీ తాతల్లాగా, నాన్నలాగా గొప్పపేరు తెచ్చుకో!" అని ఆశీర్వదించాడు.

పుల్లయ్య భారంగా కదిలాడు. గుడిసె బైటకు వచ్చాడు.

"పుల్లయ్యా! ఆగు!" అన్నాడు సన్యాసి.

అక్కడే ఆగాడు వాడు. బైటకొచ్చిన సన్యాసి పుల్లయ్య చేతిని తన చేతిలోకి తీసుకొన్నాడు. ఆ చేతిలోకి పట్టేంత ఒక ఇనుప ముద్దను పెట్టి దానిపై పసరునేదో వేసాడు. మరో నిముషంలో అది బంగారంగా మారిపోయింది.

"దీని అవసరం నీకెప్పుడైనా రావొచ్చు. ఉంచుకో! జాగ్రత్త సుమా! నా విషయం, ఈ బంగారు విద్య విషయం ఎవరికైనా చెప్పావంటే ఇది మళ్ళీ ఇనుముగా మారుతుంది." అన్నాడు.

ఆ బంగారు ముద్దను పంచెలోకి భద్రంగా దోపుకొని సన్యాసికి మరోమారు దండం పెట్టి బయల్దేరాడు పుల్లయ్య.

ఎదురుగా సూర్యుడు వెలుగుతున్నాడు.

పుల్లయ్య కళ్ళు మూసుకొన్నాడు. చాలా వెలుతురుగా ఉంది.

కళ్ళు మూసినా, తెరిచినా వెలుతురుగా ఉండడమే 'గుప్తనిధి.'

పుల్లయ్య ఇప్పుడో నిధిపతి.

- - - -

# ~~oOo స మా ప్తం oOo~~